




నేటి ప్రభాత

# సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

TGTEL/25/A0784.



ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 11 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజీలు : 8, వెల రూ. 4, /- గురువారం - 12 - జూన్ - 2025


## కొణిదెల గ్రామానికి పవన్‌కల్యాణ్ రూ.50 లక్షల అందజేత

- పవన్‌కల్యాణ్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య కలిసి కొణిదెల గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు



- తమ ఇంటి పేరు కలిగిన గ్రామాన్ని సొంత నిధులతో అభివృద్ధి చేస్తానని హామీ
- ఈ నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించాలి

మిగతా.. 2లో

## దేశంలో 7,121కి పెరిగిన క్రియాశీల కేసులు..

## 24 గంటల్లో ఆరుగురు మృతి



రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..

కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 2,223 కేసులు

2లో

## అనుమతి తీసుకోలేదు, అతి ప్రచారం చేశారు

## తొక్కిసలాట ఘటనలో ఆర్సీబీదే తప్పన్న కర్ణాటక ప్రభుత్వం



బెంగళూరు తొక్కిసలాట ఘటనపై హైకోర్టులో విచారణ

ఆర్సీబీ, డీఎన్ఏపై కర్ణాటక ప్రభుత్వ తీవ్ర ఆరోపణలు

విక్టరీ పరేడ్‌కు అనుమతులు తీసుకోలేదని వెల్లడి

## కేసీఆర్ ను 50 నిమిషాల పాటు విచారించిన కాళేశ్వరం కమిషన్



- పార్టీ నేతలతో కలిసి బీఆర్కే భవన్ కు వచ్చిన బీఆర్ఎస్ అధినేత
- అనారోగ్యం కారణంగా ఇన్ కెమెరా విచారణను ఎంచుకున్న మాజీ సీఎం
- కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఫైల్ ఇచ్చిన కేసీఆర్

# నేను ఉన్నంత కాలం కాంగ్రెస్‌లోకి

# కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదు: రేవంత్ రెడ్డి

- రాష్ట్రానికి ఆ కుటుంబమే ప్రధాన శత్రువని రేవంత్ రెడ్డి వ్యాఖ్య
- మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపుపై ఢిల్లీలో చర్చ జరగలేదు
- రెండు రోజుల్లో కాళేశ్వరం డాక్యుమెంట్లు బయటపెడతామని వెల్లడి
- తెలంగాణ ప్రాజెక్టులకు కిషన్ రెడ్డి నిధులు తేలేదని విమర్శ



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాను పదవిలో ఉన్నంత కాలం కేసీఆర్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీలో ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. ఆ కుటుంబమే తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన శత్రువని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బుధవారం మీడియాతో నిర్వహించిన మిగతా.. 2లో



## ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారు

## మంత్రి పొంగులేటి

ములుగు: గత భారాస ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పథకాలు పెద్ద స్కామ్ అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ములుగులో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారని ధ్వజమెత్తారు. జాతిపితగా ప్రకటించుకునే వ్యక్తి దర్యాప్తు సంస్థ ముందు విచారణకు వచ్చారని, ఎంతటి వారైనా తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



## మంగ్లీ పుట్టినరోజు వేడుకల్లో డ్రగ్స్ కలకలం.. రిసార్ట్‌పై పోలీసుల దాడి.. గంజాయి స్వాధీనం!

సింగర్ మంగ్లీ పుట్టినరోజు వేడుకలపై పోలీసుల ఆకస్మిక దాడులు

## మంత్రి పదవి లేకపోయినా.. రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



## సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన హామీకి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది

ఈ సందర్భంగా నేడు తల్లులకు కానుకగా తల్లికి వందనం పథకం ప్రారంభం

నేడే తల్లికి వందనం నిధులు విడుదలకు కూటమి ప్రభుత్వ నిర్ణయం

67,27,164 మంది విద్యార్థులకు పథకం వర్తింపు

ఈ పథకం కింద రేపు తల్లుల ఖాతాల్లో

రూ. 8,745 కోట్లు జమ చేయనున్న ప్రభుత్వం



# కరోనా ఎఫెక్ట్.. ప్రధాని మోదీతో భేటీ కావాలంటే ఈ టెస్టు తప్పనిసరి

- దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు
- 7 వేలు దాటిన యాక్టివ్ కేసుల సంఖ్య
- ప్రధాని మోదీని కలిసే వారికి ఆర్టీ-పీసీఆర్ పరీక్ష తప్పనిసరి
- గడిచిన 24 గంటల్లో 306 కొత్త కేసులు నమోదు
- కేరళలో అత్యధికంగా 2,223 యాక్టివ్ కేసులు



న్యూఢిల్లీ : దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి మరోసారి ఆందోళన కలిగిస్తోంది. పాజిటివ్ కేసులసంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం మిగతా.. 2లో

## నేను రాయల్ ఛాలెంజ్ తాగను.. ఆర్సీబీని కొంటానా?: డీకే శివకుమార్



ఆర్సీబీ కొనుగోలు వార్తలను కొట్టిపారేసిన కర్ణాటక డిప్యూటీ సీఎం

ఐపీఎల్ ఫ్రాంచైజీని కొనే ఉద్దేశం తనకు లేదని స్పష్టీకరణ

"నేను రాయల్ ఛాలెంజ్ కూడా తాగను" అంటూ చమత్కరించిన డీకే

ఆర్సీబీ అమ్మకంపై ఎలాంటి చర్చలు జరగడం లేదన్న

ప్రస్తుత యాజమాన్యం డయాజియో

ఐపీఎల్ టైటిల్ గెలిచిన ఆర్సీబీ అమ్మకంపై వదంతులు

# చదువుకునే పిల్లలందరికీ 'తల్లికి వందనం'

- కొత్త విద్యా సంవత్సరం వేళ 'తల్లికి వందనం' పథకానికి సీఎం ఆమోదం
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలన పూర్తి సందర్భంగా ఈ పథకం అమలు
- చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నా ప్రతి తల్లికీ లబ్ధి
- 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.8745 కోట్లు జమ
- ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, దీపం-2 అమలు



అమరావతి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాదిపాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ విద్యార్థుల తల్లులకు శుభవార్త అందించింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకం అమలుకు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. మిగతా.. 2లో

# మోదీ ఇచ్చారు..

# చంద్రబాబు ఎగ్గొట్టారు: వైఎస్ జగన్

- రాష్ట్రంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే స్థితిలో కూటమి ప్రభుత్వం లేదు
- చంద్రబాబు సీఎం కావడం రైతుల పాలిట శాపం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు
- రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు
- చంద్రబాబు వచ్చాక రైతు భరోసా సాయం లేదు
- మా హయాం.. రైతులకు స్వర్ణయుగం
- లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం జగన్ హెచ్చరికలు జారీ చేశారు

## రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి.



ప్రకాశం: రాష్ట్రంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే స్థితిలో కూటమి ప్రభుత్వం లేదని, చంద్రబాబు సీఎం కావడం రైతుల పాలిట శాపమని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పొదిలి పొగాకు బోర్డును సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇవాళ రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదు. మిగతా.. 2లో

# భారతీయుడిపై అమెరికాలో దురుసు ప్రవర్తన

## వైరల్ వీడియోపై భారత్ స్పందన

అమెరికా: అమెరికాలోని నెవార్క్ విమానాశ్రయంలో ఇటీవల ఒక భారతీయ యువకుడి పట్ల అక్కడి భద్రతాధికారులు వ్యవహరించిన తీరు విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దుమారం రేగింది. తాజాగా ఈ ఉదంతంపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. సదరు యువకుడు నిబంధనలకు విరుద్ధంగా, సరైన వీసా లేకుండా అక్రమంగా అమెరికా వెళ్ళాడని, అతని ప్రవర్తన కూడా సరిగా లేదని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. విదేశాంగ శాఖ వర్గాల కథనం ప్రకారం, హర్యానాకు చెందిన ఈ యువకుడి ప్రవర్తన ప్రయాణ సమయంలో ఆమోదయోగ్యంగా లేదని తెలిసింది. "ఆ యువకుడు తప్పు చేశాడు. సరైన పత్రాలు లేకుండా అక్రమంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోకి ప్రవేశించాడు. అతని ఆరోగ్యం కుదుటపడిన తర్వాత, అతడిని తిరిగి భారతదేశానికి పంపించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ విషయమై అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని ఎంఈఏ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, యువకుడు అక్రమంగా ప్రవేశించి ఉండవచ్చని అంగీకరిస్తూనే, భద్రతా సిబ్బంది అతనిపై వ్యవహరించిన తీరుపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. యువకుడిని నేలపై పడేసి, చేతులను వెనక్కి విరిచి కట్టేసిన దృశ్యాలు తీవ్ర ఆందోళన కలిగించాయి. ఇటువంటి చర్యలు ఆమోదయోగ్యం కావని భారత్ స్పష్టం చేసింది. అక్రమ వలసదారుల విషయంలో అమెరికా కఠినంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. గతంలో ట్రంప్ పరిపాలన నుంచి ఈ వైఖరి మరింత కఠినతరమైంది. అనేక మంది అక్రమ వలసదారులను, వారిలో భారతీయులతో సహా, పలువురిని స్వదేశాలకు తిప్పి పంపించారు. ఈ నేపథ్యంలో, పౌరులు సరైన పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లవద్దని భారత ప్రభుత్వం పదేపదే హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. అయినప్పటికీ, కొందరు అక్రమ మార్గాలను ఆశ్రయిస్తూనే ఉన్నారు.

# కొణిదెల గ్రామానికి పవన్‌కల్యాణ్ రూ.50 లక్షల అందజేత

నంద్యాల పట్టణం: నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలో తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రూ.50 లక్షలు అందజేశారు. కర్నూలు జిల్లా పూడిచెర్లలో ఇటీవల పంటకుంట నిర్మాణాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న పవన్‌కల్యాణ్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య కలిసి కొణిదెల గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. అందుకు స్పందించిన ఆయన.. తమ ఇంటి పేరు కలిగిన గ్రామాన్ని సొంత నిధులతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు తాజాగా రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును నంద్యాల కలెక్టరేట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి డీఆర్వో రామునాయక్, పరిపాలనాధికారి రవికుమార్, సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహారావులకు అందజేశారు. ఈ నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. కొణిదెలలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించిందని, గ్రామస్థుల అభ్యర్థన ప్రకారం గ్రామంలో 90 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మించడంతో పాటు రోడ్లు, మురుగు కాల్వలు, ఇతర వసతులు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# కేసీఆర్ ను 50 నిమిషాల పాటు విచారించిన కాళేశ్వరం కమిషన్

హైదరాబాద్ : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను కాళేశ్వరం కమిషన్ సుమారు 50 నిమిషాల పాటు విచారించింది. ఈ రోజు మధ్యాహ్నం హరీశ్ రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలతో కలిసి కేసీఆర్ బీఆర్కే భవన్ కు చేరుకున్నారు. స్వల్ప అనారోగ్యాన్ని కారణంగా చూపుతూ ఇన్ కెమెరా విచారణను కేసీఆర్ ఎంచుకున్నారు. దీంతో ఓపెన్ కోర్టులో ఉన్న వారందరినీ అధికారులు బయటకు పంపించారు. అనంతరం జస్టిస్ పీసీ ఘోష్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ప్రశ్నించారు. ప్రాజెక్టు రీ ఇంజినీరింగ్, ఆనకట్టల నిర్మాణం, ఒప్పందాలు, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, నీటి నిల్వ తదితర అంశాలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్ వివిధ డాక్యుమెంట్లను జస్టిస్ పీసీ ఘోష్ కు అందజేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఫైలును కూడా అందించినట్లు పేర్కొన్నాయి. కాగా, ఇప్పటి వరకు కాళేశ్వరం కమిషన్ 114 మందిని విచారించింది. ఇన్నాళ్లూ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించింది. ఇటీవల మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావులను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. తాజాగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను 50 నిమిషాల పాటు విచారించింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సీపేజీ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు గతేడాది మార్చిలో కాళేశ్వరం కమిషన్ ను ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో ఈ కమిషన్ ను ఏర్పాటు చేసింది.

స్వల్ప అనారోగ్యాన్ని కారణంగా చూపుతూ ఇన్ కెమెరా విచారణను కేసీఆర్ ఎంచుకున్నారు. దీంతో ఓపెన్ కోర్టులో ఉన్న వారందరినీ అధికారులు బయటకు పంపించారు. అనంతరం జస్టిస్ పీసీ ఘోష్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ప్రశ్నించారు. ప్రాజెక్టు రీ ఇంజినీరింగ్, ఆనకట్టల నిర్మాణం, ఒప్పందాలు, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, నీటి నిల్వ తదితర అంశాలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్ వివిధ డాక్యుమెంట్లను జస్టిస్ పీసీ ఘోష్ కు అందజేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఫైలును కూడా అందించినట్లు పేర్కొన్నాయి. కాగా, ఇప్పటి వరకు కాళేశ్వరం కమిషన్ 114 మందిని విచారించింది. ఇన్నాళ్లూ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించింది. ఇటీవల మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావులను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. తాజాగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను 50 నిమిషాల పాటు విచారించింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సీపేజీ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు గతేడాది మార్చిలో కాళేశ్వరం కమిషన్ ను ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో ఈ కమిషన్ ను ఏర్పాటు చేసింది.

## దేశంలో 7,121కి పెరిగిన క్రియాశీల కేసులు..

# 24 గంటల్లో ఆరుగురు మృతి

న్యూఢిల్లీ : దేశంలో మరోసారి కరోనా వైరస్ కలకలం సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఇక నిన్న ఒక్కరోజే 300కిపైగా కొత్త కేసులు వెలుగు చూశాయి. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 7 వేలు దాటింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం .. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ 306 మందికి పాజిటివ్‌గా తేలింది. కేరళలో అత్యధికంగా నిన్న ఒక్కరోజే 170 కేసులు బయటపడ్డాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 114 కేసులు వెలుగు చూశాయి. తాజా కేసులతో కలిపి దేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121కు పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 8,573 మంది మహమ్మారిబారి నుంచి కోలుకున్నారు. 24 గంటల్లో ఆరు మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో ఒకరు, కర్ణాటకలో ఇద్దరు, కేరళలో ముగ్గురు కొవిడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 74కి ఎగబాకింది.

### రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..

కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 2,223 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్ (1,223), ఢిల్లీ (757), పశ్చిమ బెంగాల్ (747), మహారాష్ట్ర (615), కర్ణాటక (459), ఉత్తరప్రదేశ్ (229), తమిళనాడు (204), రాజస్థాన్ (138), హర్యానా (125), ఆంధ్రప్రదేశ్ (72), మధ్యప్రదేశ్ (65), ఛత్తీస్‌గఢ్ (48), బీహార్ (47), ఒడిశా (41), సిక్కిం (33), పంజాబ్ (33), తెలంగాణ (11), జార?ండ్ (10), పుదుచ్చేరి (10), జమ్ము కశ్మీర్‌లో తొమ్మిది, అస్సాం, గోవా రాష్ట్రాల్లో ఆరు చొప్పున, ఛండీగఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో మూడు చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో రెండు కేసులు, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కో కేసు యాక్టివ్‌గా ఉంది.

## కరోనా ఎఫెక్ట్.. ప్రధాని మోదీతో భేటీ

# కావాలంటే ఈ టెస్టు తప్పనిసరి

మొదటి పేజి తరువాయి

పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసే మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. తాజాగా నమోదవుతున్న కేసులతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 7 వేలు దాటింది. బుధవారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా 306 కొత్త కరోనా కేసులు వెలుగుచూశాయి. దీంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారి సంఖ్య 7,121కి చేరింది. ఇప్పటివరకు దేశంలో కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 74కు పెరిగింది. ఈ పరిస్థితుల దృష్ట్యా, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని ఆరోగ్య శాఖ సూచించింది. ముఖ్యంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యే కేంద్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ముఖ్యమైన వ్యక్తులు తప్పనిసరిగా ఆర్టీ-పీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని పీఎంఓ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను కూడా పీఎంఓ అధికారులు చేస్తున్నారని సమాచారం. దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం 7,121 యాక్టివ్ కేసుల్లో కేరళలో అత్యధికంగా 2,223 కేసులు ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో గుజరాత్ (1,223), ఢిల్లీ (757), పశ్చిమ బెంగాల్ (747), మహారాష్ట్ర (615), కర్ణాటక (459) రాష్ట్రాలు నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో 72 యాక్టివ్ కేసులు ఉండగా, తెలంగాణలో 11 కేసులు నమోదయ్యాయి. ఉత్తర ప్రదేశ్‌లో 229, తమిళనాడులో 204, రాజస్థాన్‌లో 138, హర్యానాలో 125, మధ్యప్రదేశ్‌లో 65, ఛత్తీస్‌గఢ్‌లో 48, బీహార్‌లో 47, ఒడిశాలో 41, సిక్కిం, పంజాబ్‌లలో ఒక్కో రాష్ట్రంలో 33 చొప్పున కేసులు ఉన్నాయి. పుదుచ్చేరి, ఝూర?ండ్‌లలో చెరో 10, జమ్ముకశ్మీర్‌లో 9, అసోం, గోవాలలో 6 చొప్పున, చండీగఢ్, ఉత్తరాఖండ్‌లలో 3 చొప్పున, హిమాచల్ ప్రదేశ్‌లో 2, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కో కేసు చొప్పున నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# అనుమతి తీసుకోలేదు, అతి ప్రచారం చేశారు



బెంగళూరు: ఐపీఎల్ విజేతగా నిలిచిన ఆర్సీబీ జట్టు విజయోత్సవ ర్యాలీ సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం ఆర్సీబీ యాజమాన్యం పైనా, బీసీసీఐ పైనా తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించింది. విజయోత్సవ కార్యక్రమానికి నిర్వాహకులు ఎలాంటి ముందస్తు అనుమతులు పొందలేదని, కేవలం సమాచారం మాత్రమే ఇచ్చారని ప్రభుత్వం కోర్టుకు నివేదించింది. అంతేకాకుండా, ఆర్సీబీ జట్టు తమ సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా ఈవెంట్‌కు విపరీతమైన ప్రచారం కల్పించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుందని ప్రభుత్వం వాదించింది. ఈ తొక్కిసలాట ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి, ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసలేతో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తమ అరెస్టును సవాలు చేస్తూ వారు కర్ణాటక హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం ముందు కర్ణాటక ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి తమ వాదనలు వినిపించారు. "విజయోత్సవ ర్యాలీ నిర్వహణ కోసం వారు ముందుగా ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. కేవలం ప్రభుత్వానికి సమాచారం మాత్రమే అందించారు. జూన్ 3వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరగడానికి కేవలం గంట ముందు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం నుంచి ఒక లేఖ అందింది. అందులో పరేడ్‌కు అనుమతి ఇవ్వాలన్న అభ్యర్థన ఏమీ లేదు. కేవలం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాత్రమే తెలిపారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం" అని అడ్వొకేట్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, "ఈ విక్టరీ పరేడ్ గురించి ఆర్సీబీ జట్టు అర్ధరాత్రి నుంచే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసింది. టికెట్లు లేదా ప్రవేశానికి సంబంధించిన సరైన సమాచారం ఇవ్వకుండానే అభిమానులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చింది. దీని ఫలితంగానే సుమారు 3.5 లక్షల నుంచి 4 లక్షల మంది అభిమానులు స్టేడియం గేట్ల వద్దకు పోటెత్తారు" అని ప్రభుత్వ తరఫు న్యాయవాది వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నట్లుగా ప్రచారం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ ఇది పూర్తిగా ఆర్సీబీ నిర్వహించిన ప్రైవేటు ఈవెంట్ అని ప్రభుత్వం స్పష్టం చేసింది. "మైదానం వద్ద భద్రత, గేట్ల నిర్వహణ, టికెట్ల జారీ వంటి అంశాలకు సంబంధించి ఆర్సీబీ మరియు బీసీసీఐ మధ్య ఒప్పందం ఉంది. కాబట్టి, ఈ ఘటనకు బీసీసీఐ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈవెంట్ సమయంలో కనీస ఏర్పాట్లు కూడా సరిగా లేవు. సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు" అని కర్ణాటక ప్రభుత్వం కోర్టులో ఆరోపించింది.




# మోదీ ఇచ్చారు.. చంద్రబాబు ఎగ్గొట్టారు

మొదటి పేజి తరువాయి

రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం జిల్లాలో(పరుచూరు, కొండెపి) ఇటీవలే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. మా హయాంలో రైతు రాజ్యం నడిచింది. కానీ, కూటమి ప్రభుత్వంలో రైతు నష్టపోతున్నాడు. మా హయాంలో ఖరీఫ్ సీజన్‌లోనే పెట్టుబడి సాయం అందించాం. చంద్రబాబు వచ్చాక రైతు భరోసా సాయం లేదు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కాకుండా మరో రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు అన్నారు. గతేడాది రైతు భరోసా రూ.20 ఎగ్గొట్టారు. మోదీ ఇచ్చారు.. చంద్రబాబు ఎగ్గొట్టారు

మా హయాం.. రైతులకు స్వర్ణయుగం

మా ప్రభుత్వంలో రైతుకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ప్రతీ రైతుకు అదనంగా రూ.10 వేలు ఇచ్చేవాళ్లం. పారదర్శకంగా ఉచిత బీమా అందించాం. మా హయాంలో రైతుకు వెన్నెముకగా ఆర్బీకే(రైతు భరోసా కేంద్రాలు)లు నిలిచాయి. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశాం. మార్కెట్‌లో పోటీ పెరిగి రైతుకు గిట్టుబాటు ధర వచ్చేది. కేంద్రం ప్రకటించిన పంటలకే కాకుండా.. రాష్ట్రం నుంచి అనేక పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ఏ పంటకైనా గిట్టుబాటు ధర లేకుంటే ఆర్బీకే ద్వారా ఇచ్చేవాళ్లం. ఐదెకరాల మిర్చి రైతులకు రూ.4లక్షల పరిహారం ఇచ్చిన ఘనత మాది. మా హయాంలో రైతులకు సువర్ణ యుగం. ఏ రకంగానూ రైతును నష్టపోనివ్వలేదు.

### కూటమి పాలనలో అధ్వానం

కూటమి వచ్చాక ఉచిత బీమా ఎత్తేశారు. దళారీలు లేకుండా ఇప్పుడు పంట కొనే పరిస్థితి లేదు. ఈ క్రాప్ వ్యవస్థను నీరుగార్చారు. కూటమి వచ్చాక ఇన్‌పుట్ సబ్సీడీని గాలికొదిలేశారు. కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలతో నష్టపోతున్నారు. 2023-24లో కేజీ పొగాకు రూ.366కి అమ్ముడుపోయేది. ఇప్పుడు రూ.240 కూడా అమ్ముడుపోవడం లేదు. క్వింటా పొగాకు రూ.24 వేలు తగ్గకుండా రైతు అమ్ముకున్నాడు. 220 మిలియన్ టన్నులు ప్రొక్యూర్ చేయాల్సి ఉంటే.. కేవలం 40 మిలియన్ టన్నులే ప్రొక్యూర్ చేశారు. హైగ్రేడ్ పొగాకుకు కూడా ఈరోజు గిట్టుబాటు ధర దక్కడం లేదు. పొగాకు బ్లాక్ బర్లీ రైతు ఎకరాకు రూ.80వేలు నష్టపోతున్నాడు. చంద్రబాబు సీఎం కావడం రైతులకు శాపం. మా హయాంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాం. మార్క్‌ఫెడ్ రావడంతో మార్కెట్‌లో పోటీ పెరిగింది. మీరెందుకు ఆ పని చేయలేదు?. అసలు ప్రభుత్వం ఎందుకు మార్క్‌ఫెడ్ వేలంలో పాల్గొనలేదు. బాబు, దళారుల మధ్య సంబంధాలతో రైతులు నష్టపోతున్నారు.

### చంద్రబాబుకు జగన్ హెచ్చరిక

వ్యవసాయం దండగ అనే రీతిలో చంద్రబాబు పాలన కొనసాగుతోంది. పొగాకు వేసుకోమని చెప్పి రైతులను నట్టేట ముంచుతున్నారు. రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం జగన్ హెచ్చరికలు జారీ చేశారు.

# చదువుకునే పిల్లలందరికీ 'తల్లికి వందనం'

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో ఆర్థిక సహాయం జమ చేయనున్నట్లు ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల 27 వేల 164 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. వీరి తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం మొత్తం రూ. 8745 కోట్లు జమ చేయనుంది. ఒకటో తరగతిలో కొత్తగా అడ్మిషన్ పొందే చిన్నారులతో పాటు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని మంత్రి వివరించారు. విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు, వారి తల్లులకు మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని గుర్తు చేశారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, మెగా డీఎస్సీ ప్రకటన, దీపం-2 పథకాల అమలు దిశగా చర్యలు తీసుకున్నామని, తాజాగా 'తల్లికి వందనం' పథకం అమలుతో మరో ముఖ్యమైన హామీని నిలబెట్టుకున్నామని లోకేష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఈ పథకానికి పచ్చజెండా ఊపడం సంతోషకరమని ఆయన అన్నారు.


## నేను ఉన్నంత కాలం కాంగ్రెస్‌లోకి

# కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదు

ఢిల్లీలో బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, మంత్రులకు శాఖల కేటాయింపు అంశంపై ఢిల్లీలో అధిష్ఠానంతో ఎటువంటి చర్చలు జరగలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ చేరుకున్న తర్వాత పార్టీలోని ముఖ్య నేతలందరితో సంప్రదింపులు జరిపి, ఆ తర్వాతే శాఖల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ప్రధానంగా కర్ణాటకలో కులగణన అంశంపై మాత్రమే అధిష్ఠానంతో చర్చించినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే ప్రజల ముందు ఉంచుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే రెండు రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను బహిర్గతం చేస్తానని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, ఇతర అంశాలపై స్పష్టత ఇస్తామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా కిషన్ రెడ్డి కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేకపోయారని ఆయన విమర్శించారు. ఢిల్లీ పర్యటనలో ప్రధానంగా కర్ణాటకలో కులగణన అంశంపై మాత్రమే అధిష్ఠానంతో చర్చించినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే ప్రజల ముందు ఉంచుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాబోయే రెండు రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను బహిర్గతం చేస్తానని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, ఇతర అంశాలపై స్పష్టత ఇస్తామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా కిషన్ రెడ్డి కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేకపోయారని ఆయన విమర్శించారు.

## సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన

# హామీకి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్



అమరావతి : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా రేపు తల్లులకు కానుకగా తల్లికి వందనం పథకం అమలు చేయనున్నట్లు ఏపీలోని కూటమి ప్రభుత్వం వెల్లడించింది. రేపే తల్లికి వందనం నిధులు విడుదలకు ప్రభుత్వం నిర్ణయించింది. 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం నిధులు రేపు ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం తెలిపింది. కాగా, ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయం తీసుకుంది. దీంతో 67,27,164 మంది విద్యార్థులకు పథకం వర్తింపజేయనుంది. ఇందులో భాగంగా తల్లుల ఖాతాల్లో రేపు ప్రభుత్వం రూ. 8,745 కోట్లు జమ చేయనుంది. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులకు కూడా తల్లికి వందనం అమలు కానుంది. అడ్మిషన్లు పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తారు. పథకం విధి విధానాలను ఖరారు చేస్తూ అధికారులు ఇవాళ జీఓ విడుదల చేయనున్నారు. ఇక, సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలు అమలు చేసిన విషయం తెలిసిందే.

## నేను రాయల్ ఛాలెంజే తాగను.. ఆర్సీబీని కొంటానా?: డీకే శివకుమార్

బెంగళూరు: ఈ ఏడాది ఐపీఎల్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంఛైజీ అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. బెంగళూరు యాజమాన్యం డియాజియో కంపెనీ ఫ్రాంఛైజీని పూర్తిగా లేదా అందులో కొంత వాటాను విక్రయించడానికి సిద్ధమైనట్లు ప్రచారం జరిగింది. ఇప్పటికే పలువురు పెట్టుబడిదారులతో చర్చలు జరిపిందని, ఫ్రాంఛైజీ ధరను 2 బిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు రూ.17,032 కోట్లు)గా నిర్ణయించినట్లుగా వ్యాపార వర్గాలు తెలిపాయి. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్సీబీలో వాటాలు కొనుగోలు చేయనున్నట్లు తాజాగా వార్తలొస్తున్నాయి. ఈ విషయంపై ఆయన స్పందించారు. ఇదంతా తప్పుడు ప్రచారమని పేర్కొన్నారు. 'నేను నా చిన్నప్పటి నుంచి కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌లో సభ్యుడిని, అంతే. ఆర్సీబీ మేనేజ్‌మెంట్‌లో భాగస్వామిగా చేరాలని ఆఫర్లు ఉన్నప్పటికీ నాకు సమయం లేదు. నాకు ఆర్సీబీ ఎందుకు అవసరం?' అని డీకే శివకుమార్ అన్నారు. మరోవైపు, బెంగళూరు ఫ్రాంఛైజీని అమ్ముతున్నారన్న వార్తలు బయటకు రాగానే మంగళవారం ఉదయం యునైటెడ్ స్పిరిట్స్ షేర్లు 3.3 శాతం పెరగడం విశేషం. 2008లో ఐపీఎల్ ఆరంభ సమయంలో యూబీ గ్రూపు అధినేత విజయ్ మాల్యా బెంగళూరు ఫ్రాంఛైజీని దక్కించుకున్నాడు. తర్వాత మాల్యా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో భారత్‌లోని అనుబంధ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ ద్వారా బెంగళూరు ఫ్రాంఛైజీని డియాజియో కొనుగోలు చేసింది. అయితే, ఆర్సీబీ అమ్మకంపై వచ్చిన వార్తలను డియాజియో ఖండించింది.

## మంత్రి పదవి లేకపోయినా.. రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై తాజాగా రాజగోపాల్ రెడ్డి స్పందించారు. తాను మంత్రిగా లేకపోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతానని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తాజాగా ట్విట్టర్ వేదికగా..'తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను. నాకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే కారణంగా నేనే తిరిగి కాంగ్రెస్ పార్టీకి వచ్చాను. ఈరోజు నేను మంత్రిగా లేకపోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతాను. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో నేను ఎప్పటికీ ముందుంటాను. నా రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదు. కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పనిచేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుంది. అదే మార్గాన్ని నేను ఎంచుకున్నాను' అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను. నాకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే.

## మంగ్లీ పుట్టినరోజు వేడుకల్లో డ్రగ్స్ కలకలం.. రిసార్ట్‌పై పోలీసుల దాడి.. గంజాయి స్వాధీనం!

హైదరాబాద్ : ప్రముఖ జానపద గాయని మంగ్లీ పుట్టినరోజు వేడుకలు వివాదాస్పదంగా మారాయి. చేవెళ్లలోని త్రిపుర రిసార్ట్‌లో అర్ధరాత్రి జరిగిన ఈ వేడుకలపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ పార్టీలో మాదకద్రవ్యాల వినియోగం జరిగిందన్న ఆరోపణలు, అధికారిక అనుమతులు లేకపోవడం, అక్రమంగా సౌండ్ సిస్టమ్స్ వాడటం వంటి పలు ఉల్లంఘనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో పలువురు సినీ ప్రముఖులు కూడా పోలీసుల నిఘాలోకి వచ్చినట్లు తెలుస్తోంది. చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భూపాల్ శ్రీధర్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఓ రహస్య సమాచారం ఆధారంగా ఈ దాడి నిర్వహించారు. తనిఖీల సమయంలో దామోదర్ అనే వ్యక్తి పార్టీ జరుగుతున్న ప్రదేశంలో గంజాయి సేవిస్తూ పట్టుబడ్డాడు. దీంతో, ఈ వేడుకల్లో మాదకద్రవ్యాల వినియోగం ఏ స్థాయిలో జరిగిందనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం, ఎక్సైజ్ శాఖ అనుమతి లేకుండా మద్యం సరఫరా చేయడం వంటి కారణాలతో గాయని మంగ్లీపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అలాగే, అవసరమైన అనుమతులు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించడానికి అనుమతించినందుకు త్రిపుర రిసార్ట్ జనరల్ మేనేజర్‌పైనా కేసు నమోదు చేశారు. అంతేకాకుండా, ఎలాంటి సౌండ్ పర్మిషన్ లైసెన్స్ లేకుండా ఉపయోగిస్తున్న డీజే పరికరాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పార్టీకి నటి దివి, సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్‌తో పాటు మరికొందరు ప్రముఖులు హాజరైనట్లు సమాచారం. కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, పార్టీకి హాజరైన వారికి కూడా పోలీసులు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఘటనతో టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# నిరుపేదలకు ఇండ్ల స్థలాలు పంచాలి

### పెరుమండ్ల అంజయ్య , జంగయ్య డిమాండ్

### రెవెన్యూ సదస్సులో కీర్తి సాగరకు వినతిపత్రం అందజేత



యాచారం సూర్య న్యూస్ ( జూన్ 11):. మండల పరిధిలో నంది వనపర్తి లో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని రెవిన్యూ సరస్సులో డిప్యూటీ తాసిల్దార్ కీర్తి సాగర్ కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి అంజయ్య, ఎం జంగయ్య వినతిపత్రం అందజేశారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2006- 2007 సంవత్సరములో నంది వనపర్తి గ్రామంలో సర్వేనెంబర్ 2 లో మూడు ఎకరాలు భూమి అదే గ్రామానికి ఆనుకొని ఉన్నది. ఇంటి స్థలం లేనివారికి ఇంటి స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల పేద ప్రజలను చైతన్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, పాపయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల కోసం కృషి

### -యాచారం తాసిల్దార్ అయ్యప్ప

### -రైతులు దరఖాస్తులు చేసుకోవాలి




యాచారం సూర్య న్యూస్ ( జూన్ 11):. భూ భారతిలో రెవిన్యూ సమస్యల కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని యాచారం తహసిల్దార్ అయ్యప్ప తెలిపారు. బుధవారం మండల పరిధిలో గునుగల్ గ్రామంలో రెవిన్యూ సదస్సు లో రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ధరణిలో కానీ రెవెన్యూ సమస్యలను , భూభారతిలో భూ సమస్యలను పరిష్కారం అవుతాయని అన్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, పవన్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బాసాని బుచ్చిరెడ్డి, మాజీ డైరెక్టర్ మచ్చ లక్ష్మణ్, కాశమల్ల యాదయ్య, నాయకులు, అధికారులు రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ అంగన్వాడి కేంద్రంలో

# ఇంగ్లీష్ మీడియం చదువు..!

### బొట్టుపెట్టిఆహ్వానిస్తున్న అంగన్వాడీ టీచర్ మహేశ్వరి..!

### కొంగగూడ తండాలో బడిబాట కార్యక్రమం..



షాద్ నగర్ ప్రభాత సూర్య ప్రతినిధి (జూన్ 11): ప్రైవేట్ పాఠశాలలకు వద్దు ప్రభుత్వ అంగన్వాడి కేంద్రాలకు విద్యార్థులను పంపించండి అని అంగన్వాడి టీచర్ మహేశ్వరి ఐ సి డి సి ప్రాజెక్ట్ సిడిపిఓ ఉదయ్ మేడం అన్నారు. బుధవారం నాడు ఫరూఖ్ నగర్ మండలంలోని కొంగగూడ తండాలో అంగన్వాడి విద్యార్థుల కోసం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.సిడిపిఓ ఉదయ్ మాట్లాడుతూ. విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరు కూడా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపవద్దని ప్రభుత్వ అంగన్వాడి కేంద్రం (సెంటర్లకు,పాఠశాలలో) ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన కొనసాగుతుందని విశాలమైన తరగతి గదులలో ప్రశాంత వాతావరణంలో విద్యాబోధన ప్రత్యేక తరగతులతో పాటు వ్యక్తిగత శ్రద్ధ ప్రభుత్వము ఉచిత పాఠ్యపుస్తకాలు రెండు జతల యూనిఫాం ఉచిత మధ్యాహ్న భోజనం మనోవికాసాభివృద్ధికి సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు సౌకర్యం పుస్తకాలు ఇలా ప్రభుత్వము మౌలిక వసతుల కల్పనతో పేద విద్యార్థులకు విద్యను అందించేందుకు కృషి చేస్తుందని కాబట్టి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులు లక్షల రూపాయల అప్పులు చేసుకొని ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వ అంగన్వాడి కేంద్రం ,లు (సెంటర్లో)లో సైతం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో తెలుగు ఇంగ్లీష్ మీడియం విద్యను అందిస్తున్నామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల కు బొట్టు పెట్టి పిల్లలను అంగన్వాడి సెంటర్ కు పంపమని కోరారు. కొంగగూడ తండాలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ఉదయ్ మేడం అంగన్వాడి టీచర్ మహేశ్వరి హెల్పర్ విజయలక్ష్మి, సెల్ఫ్ హెల్త్ గ్రూప్ సభ్యులు,మరియు మదర్ ఫాదర్స్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.




# నందిగామ మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



నందిగామ ప్రభాత సూర్య న్యూస్ జూన్ 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ అందుతాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఊరి పేదలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. బుధవారం నందిగామ మండలం చర్ల అంతిరెడ్డిగూడ, వీర్లపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ వేడుకల్లో ఎంపీడీవో సుమతి, ఎంపీఓ తేజ సింగ్, మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్, హౌసింగ్ పిడి సిడి నాయక్ ,వీర్లపల్లి మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, రాములమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, యూత్ కాంగ్రెస్ వెంకటచారి.మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, దేపల్లె కుమార్ గౌడ్, మాజీ





ఎంపీటీసీ చంద్రశేఖర్, కావలి కృష్ణ,అన్వర్ , సి మల్లేష్, సీతారాం,ప్రభు, ప్రభాకర్, మంకాల శ్రీశైలం, గుండాల వేణుగోపాల్,ఆవులశివ, సట్టి శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జి నవీన్ గౌడ్, బుగ్గ నర్సింలు, బుగ్గ శ్రవణ్, సాములయ్య,ఈదులపల్లి సర్పంచ్ రాజు, సాలయ్య,గడ్డం జంగయ్య, చీకూర్తిదర్శన్, శేఖర్ రెడ్డి తదితరలన్నారు..

## భూ సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు



చింతపల్లి, ప్రభాత సూర్య ప్రతినిధి జూన్ 11: భూ సమస్యల పరిష్కారానికి రైతులకు రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని చింతపల్లి మండల తహసిల్దార్ రమాకాంత్ శర్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని అర్జీదారుల సమస్యలను స్వయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి ఆన్లైన్ లో నమోదు చేయించారు. వివరాల నమోదులో తప్పిదాలు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. చింతపల్లిలో 48 దరఖాస్తులు రాగా ఉమ్మాపురంలో 40 మొత్తం రెండు గ్రామాల్లో కలిపి 88 దరఖాస్తులు వచ్చాయని వాటిని వెంటనే పరిశీలించి పరిష్కరిస్తామని అర్జీదారులకు తెలిపారు. గురువారం తక్కల్లపల్లి, అనాజిపురం (నందిగడ్డ) గ్రామాలలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయని, రైతులు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సునీత, శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నవీన,కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంత్, రికార్డ్ అసిస్టెంట్ గిరి,వాలు పాల్గొన్నారు.

# రవీంద్ర భారతి స్కూల్ మూసివేత


### నిబంధనలు పాటించని స్కూల్ పై విద్యా శాఖ చర్యలు

### శ్మశానం పక్కన స్కూల్ రన్


### విద్యా శాఖ అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహణ



హయత్ నగర్-ప్రభాత సూర్య: రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లో రవీంద్ర భారతి స్కూల్ మూతపడింది. నిబంధనలకు విరుద్ధంగా




నడుపుతున్నారు అని విద్యాశాఖ మూసివేసింది. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో చర్యలు తీసుకుంది. హయత్ నగర్ లో రవీంద్ర భారతి పేరుతో స్కూల్ నడిచింది. ఐతే.. పాఠశాల భవనం శ్మశానం పక్కనే ఉంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ నడిపిస్తున్నారు. విద్యా శాఖ అనుమతులు కూడా ఈ పాఠశాలకు లేవు. రవీంద్ర భారతి స్కూల్ పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం పోరాటం చేసింది.టి. బి. సి రాష్ట్ర అధికార ప్రతినిధి శివ బహుజన్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు ఎర్రి శ్రీ హరిగౌడ్ ఫిర్యాదు చేసారు. దీంతో జిల్లా విద్యా శాఖ అధికారులు స్కూల్ పై చర్యలు తీసుకున్నారు. వెంటనే మూసి వేయాలని నోటీసులు ఇచ్చింది.



తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం
TELANGANA B.C. SANKSHEMA SANGAM
Regd. No. 108/10
B.C. Bhavan, H.No. 3-6-427/1, 2nd Floor, Street No. 4 & 5, Beside Taruni Jwellers, Himayat Nagar, Hyderabad - 500029

To
The Collector/ DEO Rangareddy

Date: 04/ 06 / 2025

Sub : Please Suspend Hayathnagar Mandal Education Officer

Ravindra Bharati School is located in Hayathnagar Mandal of Hayathnagar village. That school is running illegally from One year with out permissions from Education department and other departments also and also it is located beside a CEMETERY also

This is a very serious, Disgusting, Intolerable thing, even Evil, this is a Dangerous game that some selfish people are playing with the future of young children. we gave already given complaint to DEO&MEO on 22nd may 2025, but The fact that the relevant education officials, DEO and MEO, are not taking any action despite knowing this matter is also intolerable to the people and the Society.
Please inform us that if this school is not immediately sealed, & not Suspended Hayathnagar Mandal Education Officer also,
our public associations will announce immediately appropriate action.

V. Shiva kumar
State Spokes Person
+919394736326

### బస్ పాస్ చార్జీలను పెంచే

# ఆలోచనను విరమించుకోవాలి

### ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ మేనేజర్ కు ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం.




ఇబ్రహీంపట్నం-ప్రభాత సూర్య ప్రతినిధి: ప్రజా రవాణాలో బస్ పాస్ చార్జీలు పెంచడాన్ని ఎబివిపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందడి శ్రీరామ్ అన్నారు. బస్ పాస్ చార్జీలను పెంచే ఆలోచనను విరమించుకోవాలని బుధవారం ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ మేనేజర్ కు ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్సు కారణంగా సరిపడ బస్సు లు లేక విద్యార్థులు తమ ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని ఫుట్ బోర్డ్ ప్రయాణం చేస్తున్నారని విద్యార్థులకు సరిపడ బస్ లు నడపడం చేత కానీ అధికారులు బస్ పాస్ చార్జీలు మాత్రం పెంచడానికి ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్సు హామీ కారణంగా వస్తున్న నష్టాన్ని భర్తీ చేయటానికే విద్యార్థుల మీద భారం మోపుతోందన్నారు. అధికారులు బస్సు పాస్ ఛార్జీలు పెంచాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకొని విద్యార్థులకు పాత బస్ పాస్ చార్జీలే నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో వీరపట్నం జిల్లా కన్వీనర్ దొంతగోని శివ కృష్ణ, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పయ్యంశెట్టి జగదీష్ పటేల్, రాష్ట సోషల్ మీడియా కో కన్వీనర్ మైలారం పవన్ వీరపట్నం నగర కార్యదర్శి రుద్రపెల్లి మహేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### గురు నానక్ విద్య సంస్థలలో

# ప్రపంచ రక్త దాతల దినోత్సవం




ఇబ్రహీంపట్నం, ప్రభాత సూర్య ప్రతినిధి జూన్ 11 ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ విద్య సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం 2025 సందర్భంగా మెగా రక్త దాన శిబిరాన్ని స్కూల్ ఆఫ్ ఫార్మసీ, గురు నానక్ హెూమియోపతి మెడికల్ కాలేజ్, హాస్పిటల్, తెలంగాణ రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ సర్వీస్ స్కీమ్ ఎన్ఎస్ఎస్ తో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గురు నానక్ యూనివర్సిటీ రెక్టర్ డా. కలైరాసన్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభిస్తూ ఆయన యువతను మానవతా సేవలో ముందుండాలని ప్రోత్సహిస్తూ, రక్తదానం ప్రాధాన్యతను వివరించారు. స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ డైరెక్టర్ డా. రషీద్ హరూన్ గారు మరియు గురు నానక్ హెూమియోపతి మెడికల్ కాలేజ్ %డ% హాస్పిటల్ ప్రిన్సిపాల్ డా. రేణుక బి.వై. గారు కార్యక్రమంలో పాల్గొన్న రక్త దాతలు, అతిధులు, స్వచ్ఛంద సేవకులు, ఎన్ఎస్ఎస్ బృంద సభ్యులకు తమ కృతజ్ఞతలు తెలిపారు. గురు నానక్ విద్య సంస్థల వైస్ చైర్మన్ మరియు గురు నానక్ యూనివర్సిటీ చాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ గారు కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ వారి సందేశంలో "రక్తదానం స్వార్థరహిత సేవకు ప్రతీక అని, మానవ సేవలో విద్యార్థులు మరియు సిబ్బంది చూపిన చొరవ పట్ల నాకు గర్వంగా ఉందని చెప్పారు. గురు నానక్ విద్య సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మరియు గురు నానక్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా. హెచ్.ఎస్. సైనీ మాట్లాడుతూ ఉన్నతమైన ఆశయం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద పాల్గొన్న విద్యార్థులను మరియు సిబ్బందిని అయన అభినందిస్తూ రెడ్ క్రాస్ సొసైటీ వారికీ కృతజ్ఞతలు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనాథ్ రెడ్డి (డైరెక్టర్ జీ ఎన్ ఐ టి సి), డా. సంజీవ్ శ్రీవాస్తవ (డైరెక్టర్ జి యెన్ ఐ టి ), డా. పి. పార్థసారధి (జాయింట్ డైరెక్టర్), మరియు డా. కె. వెంకట రావు (ప్రిన్సిపాల్) హాజరై, నిర్వాహక బృందాన్ని మరియు రక్తదాతలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 400 మందికి పైగా విద్యార్థులు మరియు సిబ్బంది రక్తదానం చేసి, సమాజ సేవ పట్ల తమ నిబద్ధతను చాటి చెప్పారు. ఈ సందర్భంగా ప్రతి రక్తదాతకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గారి చేతుల ప్రపంచ రక్త దాతల దినోత్సవం రోజున రక్తదాన మరియు అభినందన సర్టిఫికేట్లు ఇవ్వబడతాయని రెడ్ క్రాస్ నిర్వాహకులు తెలియ చేసారు.

## రెండు ఎద్దుల మధ్య ఫైట్.. తర్వాత ఏం జరిగిందంటే?



ఒక వీధిలో రెండు ఎద్దులు పోట్లాడుకున్నాయి. ఒక వృద్ధుడు వాటికి దగ్గరగా మెట్ల వద్ద ఉన్నాడు. ఆ ఎద్దులను తరిమేందుకు ప్రయత్నించాడు. అయితే ఒక్కసారిగా ఒక ఎద్దు అతడిపైకి దూసుకొచ్చింది. ఎద్దు దాడిలో కిందపడిన ఆ వృద్ధుడు మరణించాడు. జైపూర్: ఒక వీధిలో రెండు ఎద్దులు పోట్లాడుకున్నాయి. ఒక వృద్ధుడు వాటికి దగ్గరగా మెట్ల వద్ద ఉన్నాడు. ఆ ఎద్దులను తరిమేందుకు ప్రయత్నించాడు. అయితే ఒక్కసారిగా ఒక ఎద్దు అతడిపైకి దూసుకొచ్చింది. ఎద్దు దాడిలో కిందపడిన ఆ వృద్ధుడు మరణించాడు.) ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లోని కోటాలో ఈ సంఘటన జరిగింది. మే 31న సుభాష్ నగర్ ప్రాంతంలో రెండు ఎద్దుల మధ్య ఫైట్ జరిగింది. సమీపంలోని షాపు మెట్ల వద్ద ఒక వృద్ధుడు నిల్చొని ఉన్నాడు. పోట్లాడుతున్న ఎద్దుల బారి నుంచి తనను తాను రక్షించుకునేందుకు ప్రయత్నించాడు.కాగా, మెట్ల వద్ద ఉన్న వృద్ధుడిపైకి ఒక ఎద్దు దూసుకెళ్లింది. కొమ్ములతో బలంగా తోసేయడంతో అతడు మెట్లపై పడిపోయాడు. గమనించిన ఒక వ్యక్తి పరుగున వృద్ధుడి వద్దకు చేరుకున్నాడు. అక్కడున్న ఎద్దును అక్కడి నుంచి తరిమాడు. అయితే ఎద్దు దాడి వల్ల తీవ్ర బాధతో అల్లాడిన ఆ వృద్ధుడు చనిపోయాడు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన

# ఏడాదిన్నరగా తవ్వకాలే..



ఇబ్బందులు పడుతున్న శ్రీనగర్ కాలనీ వాసులు హైదరాబాద్ బాగ్అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీవాసులు ఏడాదిన్నర నుంచి ఇబ్బందులు పడుతున్నారు. ఏదో ఒక అభివృద్ధి పని పేరుతో కాలనీలో తవ్వకాలు జరుపుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తి నరకం అనుభవిస్తున్నారు. %దీుఖ్రష్త్ర ాూఎఎవతీజూవ్% ఎ అంబర్‌పేట, జూన్ 7: హైదరాబాద్ బాగ్అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీవాసులు ఏడాదిన్నర నుంచి ఇబ్బందులు పడుతున్నారు. ఏదో ఒక అభివృద్ధి పని పేరుతో కాలనీలో తవ్వకాలు జరుపుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తి నరకం అనుభవిస్తున్నారు. దీనిపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు చూడు ఏదో పని మీద తమ కాలనీలో తవ్వకాలు జరుపుతున్నారని వాపోతున్నారు.వివరాల్లోకి వెళ్తే.. శ్రీనివాసనగర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఇం.నెం. 2-2-654 నుంచి 2-2-677 వరకు గల ఈ కాలనీలో ఏడాదిన్నర క్రితం మంచినీటి పైప్‌లైన్ వేయడానికి రోడ్డు తవ్వారు. ఆ పైప్‌లైన్ ఈ కాలనీకి కూడా కాదు. పక్కన ఉన్న పాముల బస్తీ కోసం ఈ బస్తీ నుంచి పైప్‌లైన్ తీసుకుపోతూ తవ్వారు. అప్పుడు ఏకంగా 45 రోజులు తవ్వి వదిలిపెట్టారు. పైప్‌లైన్ వేసిన తర్వాత మట్టితో గుంతలను పూడ్చారు. కానీ రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. అలాగే గత దీపావళి(2024) సమయంలో డ్రైనేజీ పైప్‌లైన్ వేయడానికి మళ్లీ తవ్వారు. మంచినీటికోసం ఒకపైక్కన తవ్వగా.. డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్డు మధ్యలో తవ్వారు. పైప్‌లైన్ వేసిన తర్వాత అంటే దీపావళికి ఈ పనులు చేస్తే సంక్రాంతి వరకు ( జనవరి 2025 వరకు ) రోడ్డును అలాగే ఉంచారు. మట్టిపోసి గుంతలను నింపారు. కానీ మరమ్మతులు చేయలేదు. బస్తీవాసులంతా ఫిర్యాదులు మీద ఫిర్యాదులు చేస్తే అప్పుడు ప్యాచ్‌వర్క్ చేశారు.మళ్లీ మూడు నెలల క్రితం మార్చి నెలలో కొత్త రోడ్డు వేయడానికి మంత్రి పొన్నం ప్రభాకర్, వీహెచ్ తదితరులు శంకుస్థాపన చేశారు. కానీ పది రోజుల క్రితం రోడ్డును తవ్వి.. అలాగే వదిలారు. రోడ్డు వేయడం లేదు. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం ద్వారా వృద్ధులు నడవలేకపోతున్నారు. దీంతో తమకు ఇవేమీ బాధలంటూ మొత్తుకుంటున్నారు. ఏడాదిన్నర నుంచి వివిధ రకాల పనుల కోసం కాలనీ రోడ్డును తవ్వి తమను ఇబ్బందులపాలు చేస్తున్నారని వాపోతున్నారు. పది రోజుల క్రితం రోడ్డును తవ్వి ఇంకా పనులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధను ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తమ బాధను పట్టించుకోని వెంటనే రోడ్డు వేసేలా చూడాలని కోరుతున్నారు.

## ఆలేరు కేంద్రంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలి



పసునూరి వీరేశం నియోజకవర్గ కేంద్రమైన ఆలేరు పట్టణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసునూరి వీరేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో జరిగిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరు టౌన్, జూన్ 11 : నియోజకవర్గ కేంద్రమైన ఆలేరు పట్టణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసునూరి వీరేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో జరిగిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరు పేరుకే అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ఉందని, కానీ ఆలేరుకు రావాల్సిన కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోవడం వల్ల ఆలేరు ప్రాంతాన్ని పాలకులు పూర్తిగా విస్మరించారని ఆయన మండిపడ్డారు. గతంలో ఆలేరులో ఉన్న ఆర్ అండ్ బి కార్యాలయం యాదగిరిగుట్ట తరలించడం జరిగిందన్నారు. అలాగే ఆలేరుకు రావాల్సిన ఏసీపీ కార్యాలయం, ఆలేరులో ఉండాల్సిన సబ్ రిజిస్టర్ ఆఫీస్, ఆలేరుకు రావాల్సిన వంద పడకల హాస్పిటల్ యాదగిరిగుట్ట ప్రాంతానికి తరలించడం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తాజాగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తుర్కపల్లికి తరలించడం సమంజసమేనా అని ఆయన ప్రశ్నించారు. పాలకులు ఆలేరు ప్రాంతాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆలేరు రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, దాదాపు 18 నెలలు కావస్తున్నా ఇంతవరకు అధికార ప్రకటన రాకపోవడం శోచనీయమన్నారు. ఈ విధంగా ఆలేరులోని కార్యాలయాలు వేరే ప్రాంతానికి తరలిస్తే 2026లో జరిగే డీలిమిటేషన్‌లో ఆలేరు అసెంబ్లీ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.వెంటనే ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందించి ఆలేరు రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన అధికార ప్రకటన చేయించాలన్నారు. అలాగే ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఆలేరు పట్టణంలో ఏర్పాటు చేయించాలని ఈ సమావేశంలో అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పసుపును వీరేశం, కో కన్వీనర్ రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేశ్, నంద గంగేశ్, కామిటికారి అశోక్, సముద్రాల సత్యం, బిక్కిరి సహదేవ్, బాంబే రవి పాల్గొన్నారు.

# మంటలు రేపుతున్న ఇథనాల్ కంపెనీలు



కరువు సీమ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇథనాల్ మంటలు చెలరేగుతున్నాయి. వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతుల గుండెల్లో ఈ ఇథనాల్ కంపెనీలు అలజడులు రేపుతున్నాయి. పచ్చని పంట పొలాల మధ్య కాలుష్యం వెదజల్లే ఇథనాల్ కంపెనీలు మాకొద్దంటూ గ్రామాల రైతులు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే ఈ ఇథనాలు కంపెనీలను ప్రభుత్వాలు ఎలా అనుమతి ఇస్తాయని మేధావులు నిలదీస్తున్నారు. బలవంతంగా, దౌర్జన్యంగా గ్రామాలకు గ్రామాలు ఖాళీ చేయించే విధంగా ఇథనాల్ కంపెనీలు పాలమూరు జిల్లాలో చిచ్చురేపుతున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కృష్ణా, తుంగభద్ర నదులు లక్షల మంది రైతులకు జీవనాధారం, లక్షల ఎకరాలకు, లక్షల మంది ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించే జీవనదులు. ఇలాంటి జీవనదులున్న ప్రాంతంలో ఈ ఇథనాల్ కంపెనీలు ఏర్పాటు జరిగితే కాలుష్యం బారినపడే అవకాశాలు ఉన్నాయని, తద్వారా మానవాళి, జంతు జీవుల ప్రాణాలపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని పర్యావరణ వేత్తలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఇథనాల్ కంపెనీల ఏర్పాటుకు సన్నద్ధం అవుతున్నాయి. అదే సందర్భంలో గ్రామాల్లో రైతులు ఇథనాల్ కంపెనీలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమ బాట పడుతున్నారు. ఆ రైతులపై కేసులు నమోదు అవుతున్నా ముందుకే కదులుతున్నారు. అన్నం పెట్టే రైతులపై కేసులు నమోదు చేయడంలో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం గమనార్హం. ఎన్నికలకు ముందు అప్పట్లో ఇథనాల్ కంపెనీలను పాలమూరులో ఎత్తివేయాలని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పిసిసి నేతగా ఉన్న సమయంలో డిమాండ్ చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో అయిజ మండలం పెద్ద ధన్వాడలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయొద్దన్నా రైతులపై పోలీసులు కేసులు నమోదు చేసి గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా నారాయణపేట జిల్లా చిత్తనూర్ గ్రామంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు సమయంలో మాకు వద్దని ఆందోళన చేసిన రైతులపై అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడి రైతులపై లాఠీలతో కొట్టించి కేసులు నమోదు చేసింది. ఇప్పుడు బిఆర్ఎస్ నేత హరీష్‌రావు ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని డిమాండ్ చేయడం ఇరు పార్టీల ద్వంద్వ నీతికి నిదర్శనం కాదా? అసలు ఇథనాల్ కంపెనీ అంటే ఏమిటి? దానిని ప్రభుత్వం ఎందుకు అనుమతులు ఇస్తోంది? ఈ కంపెనీల వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం? దీని వలన నిజంగా గ్రామాలకు, రైతులకు మేలు చేస్తుందా? మేలే జరిగితే రైతులు దానికి ఎందుకు వ్యతిరేకిస్తున్నట్లు వంటి సవా లక్ష ప్రశ్నలు బేరీజు వేసుకుంటే అసలు ఇథనాలు కంపెనీల వెనుక ఉన్న బడా నేతల వ్యూహాలు, అసలు దోపిడీ కథలు వెలుగులోకి రానున్నాయి. అసలు ఇథనాల్ అంటే ఏమిటంటే కేంద్ర ప్రభుత్వం పర్యావరణ కాలుష్యం, రైతులకు ఆర్థిక చేయూత, క్రూడ్ దిగుమతుల భారం తగ్గించుకోవడం వంటి అంశాల ఆధారంగా ఒకే పరిష్కార మార్గంగా కనుగొనబడిందే ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్. దీనిని కేంద్ర ప్రభుత్వం 2003లో ప్రారంభించింది. ముఖ్యంగా వాహనాలకు వాడే పెట్రోల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించుకోవడం కోసం ఈ ఇథనాల్ ప్రత్యామ్నాయ ఇంధన రసాయనాన్ని ప్రోత్సహించింది. చెరకు, మొక్కజొన్న, బియ్యం, గోధుములు వంటి వాటి ద్వారా ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి వనరులు పెరిగి వరి పెద్ద ఎత్తున సాగు అవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇథనాల్ కంపెనీలకు కేంద్రం అందించే సబ్సీడితోపాటు ఇతర సదుపాయాలను తమకు అనుకూలంగా మల్చుకునేందుకు బడా రాజకీయ పార్టీలు (అన్ని పార్టీల నేతలు) ఈ కంపెనీల ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. బడా వ్యాపారవేత్తలతోపాటు అన్ని రాజకీయ పార్టీల నేతలు సభ్యులుగా ఉంటూవచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా పది ఇథనాల్ కంపెనీలు ఏర్పాటు చేయాలన్నది లక్షంగా ముందుకు వచ్చారు. అందులో భాగంగానే పేద జిల్లా, కరువు జిల్లా ఉమ్మడి పాలమూరు జిల్లాను అనువైన జిల్లాగా మలుచుకున్నారు. వలస జిల్లాగా ఉన్న ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులన్నీ పూర్తి అయి పుష్కలంగా సాగునీరు వచ్చి రెండు పంటలు వేసుకొని హాయిగా జీవిస్తున్నారు. వలసలు వెళ్లకుండా ఇక్కడే పిల్లా పాపలతో జీవిస్తున్నారు. అయితే ఇప్పుడు తిరిగి వారి గుండెల్లో ఇథనాల్ కంపెనీలు గునపాలు గుచ్చుతున్నాయి. దీంతో వారు తిరిగి ఆందోళనబాట పట్టారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పూర్తిగా వెనుకబడిన జిల్లాగా ఉన్న నారాయణపేట జిల్లాలో మరికల్ మండలం చిత్తనూర్ గ్రామంలో జూరాల ఆర్గానిక్ పేరుతో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేశారు. చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారంతోపాటు మరో ఐదు గ్రామాల పరిధిలో వందల ఎకరాలు పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా ఉండేది. ఇక్కడ కోయల్ సాగర్ ప్రాజెక్టు ద్వారా నీరు అందడంతో సాగునీటి వనరులు పెరిగి పంటలు పండించుకునేవారు. ముందుగా ఇక్కడ ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయడం లేదని చెప్పి లోలోపల నిర్వాహకులు అన్ని అనుమతులు తీసుకున్నారు. ఏకంగా 408 ఎకరాలను రైతుల వద్ద నుంచి చవక ధరకు కొనుగోలు చేసి 32 ఎకరాల్లో ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో ఒక్కడ మద్యం ఫ్యాక్టరీ, మరో మందుల ఫ్యాక్టర్టీ ఏర్పాటు చేయాలన్నది వారి లక్షం. అయితే వీటి ఏర్పాటుకు చట్టప్రకారం పర్యావరణ అనుమతులు పొందాలి. తిరిగి గత కొంత కాలంగా అయిజ మండలం పెద్ద ధన్వాడలో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై రైతులు తిరగబడడంపై మరో మారు ఇథనాల్ కంపెనీలపై చర్చ జరుగుతోంది. ఇక్కడ కూడా ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండా పచ్చని పంట పొలాలు, గ్రామాల మధ్యన ఈ ఇథనాల్ కంపెనీ ఏర్పాటు వెనుక బడా బాబుల ధనార్జనే లక్షం కనిపిస్తోంది. కాలుష్యంతో తమ గ్రామాలు నాశనం అవుతాయని భావించిన ఇక్కడి రైతులు తిరగబడ్డారు. కంటైనర్‌ను తోసేసి, ఒక వాహనాన్ని తగుల బెట్టారు. ఇక్కడ ఇథనాల్ కంపెనీ వద్దే వద్దని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## కొమ్మినేని శ్రీనివాసరావుకు 14 రోజుల రిమాండ్



అమరావతి : రాజధాని అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యల కేసులో కొమ్మినేని శ్రీనివాసరావుకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఈనెల 24 వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తున్నట్లు మంగళగిరి కోర్టు తెలిపింది. శ్రీనివాసరావును గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఇదే కేసులో మరో నిందితుడు కృష్ణంరాజు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు. కొమ్మినేనిని సోమవారం హైదరాబాద్‌లో తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుంచి విజయవాడ మీదుగా గుంటూరులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. మంగళవారం ముందుగా గుంటూరు జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం పోలీసులు కొమ్మినేనిని కోర్టుకు తీసుకువచ్చారు. ప్రభుత్వం, నిందితుడి తరఫు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం కొమ్మినేనికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ నెల 24 వరకు ఆయనకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

## లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను వెంటనే చేపట్టండి



న్యూఢిల్లీ : లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను వెంటనే చేపట్టాలంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం ప్రధాని మోడీకి లేఖ రాశారు. ఆ పదవిని ఖాళీగా ఉంచడం రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడమేనని, ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో సరికాదని అన్నారు. " ప్రధాని గారూ.. లోక్‌సభలో ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్ పదవితో పాటు అత్యంత ఆందోళనకరమైన అంశాన్ని మీ దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ లేఖ రాస్తున్నాను. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం స్పీకర్ మరియు డిప్యూటీ స్పీకర్ ఇద్దరినీ ఎన్నుకోవడం తప్పనిసరి. రాజ్యాంగం ప్రకారం.. స్పీకర్ తర్వాత డిప్యూటీ స్పీకర్ లోక్‌సభకు రెండవ అత్యున్నత ప్రిసైడింగ్ అధికారి" అని ఖర్గే పేర్కొన్నారు. సాంప్రదాయం ప్రకారం.. డిప్యూటీ స్పీకర్ కొత్తగా ఏర్పడిన లోక్‌సభ రెండవ లేదా మూడవ సమావేశంలో ఎన్నుకోబడతారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధానం స్పీకర్ విధానాన్ని ప్రతిబింబిస్తుంది. ఏకైక వ్యత్యాసమేమిటంటే.. లోక్‌సభలో విధాన నియమావళి మరియు ప్రవర్తనా నిబంధనలలో నియమం 8(1) ప్రకారం ..డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తేదీని స్పీకర్ నిర్ణయిస్తారు. మొదటి లోక్‌సభ నుండి 16వ లోక్‌సభ వరకు ప్రతి సభలో డిప్యూటీ స్పీకర్ ఉన్నారని లేఖలో గుర్తుచేశారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ నుండి ఒక సభ్యుడిని డిప్యూటీస్పీకర్‌గా నియమించడం సంప్రదాయమని అన్నారు. అయితే స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా, ఈ స్థానం వరుసగా రెండు లోక్‌సభ పర్యాయాలుగా ఖాళీగా ఉంది. పదిహేడవ లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ ఎన్నికల కాలేదు. అలాగే 18వ లోక్‌సభలో కూడా ఇది కొనసాగవచ్చని అన్నారు. ఇది రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని పునరుద్ఘాటించారు. లేఖలో పేర్కొన్న అంశాలను దృష్టిలో ఉంచుకుని, సభ గౌరవనీయమైన సాంప్రదాయాలను మరియు మన పార్లమెంట్‌కు ప్రజాస్వామ్య నిబంధనలకు అనుగుణంగా వెంటనే లోక్‌సభ డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకునే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అభ్యర్థిస్తున్నాను అని లేఖలో పేర్కొన్నారు. జులై 21నుండి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు ఈ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు.

## యెమెన్‌లోని ఓడరేవు నగరం హొడెడాపై ఇజ్రాయిల్ దాడి



దుబాయ్ : యెమెన్‌లోని హౌతీల ఆధీనంలో ఉన్న ఓడరేవు నగరం హొడైడాపై ఇజ్రాయిల్ నావికాదళం మంగళవారం దాడి చేసింది. ఇజ్రాయిల్ సైన్యం, నేవీ క్షిపణి నౌకలు ఈదాడులు చేపట్టాయని, హౌతీ తిరుగుబాటుదారులపై తమ దళాలు దాడులు చేపట్టడం ఇదే మొదటిసారని తెలిపింది. తమపై దాడులకు సముద్ర ఓడరేవులను వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ రాస్ ఇసా, హొడైడా మరియు అల్-సలీఫ్ ఓడరేవులను ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ సోమవారం యెమన్‌కు ఆన్‌లైన్‌లో హెచ్చరికలు జారీ చేసింది. ఈ ఓడరేవుల్లో ఆయుధాలను రవాణా చేసేందుకు, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగిస్తోందని ఆరోపించింది. హౌతీలు పౌర మౌలిక సదుపాయాలను దుర్వినియోగం చేస్తుందనడానికి ఇది మరో ఉదాహరణని ఇజ్రాయిల్ ఆరోపించింది. ఈ దాడిని హౌతీలు తీవ్రంగా ఖండించారు.

## భారతీయ విద్యార్థికి ఘోర అవమానం..

# చేతులు వెనక్కిపెట్టి సంకెళ్లు



న్యూయార్క్ : అమెరికాలో భారతీయ విద్యార్థికి ఘోరమైన అవమానం జరిగింది. న్యూజెర్సీలోని నెవార్క్ విమానాశ్రయంలో భారతీయ విద్యార్థిని భద్రతాధికారులు నేలపై పడేసి.. చేతులను వెనక్కి పెట్టి సంకెళ్లు వేశారు. సుమారు నలుగురు అధికారులు అతనిని గట్టిపట్టుకోగా, వారిలో ఇద్దరు అధికారులు అతని వీపుపై మోకాళ్లను ఉంచి నొక్కి పెట్టారు. ఈ ఫోటోలు, వీడియోను ప్రత్యక్ష సాక్షి, ఎంటర్‌ప్రెన్యూర్ కునాల్ జైన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన ఈ వీడియోపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యూవార్క్ విమానాశ్రయంలో ఒక యువ భారతీయ విద్యార్థిని తాను చూశారని, చేతులకు సంకెళ్లు వేసి, నేరస్తుడిలా క్రూరంగా ప్రవర్తించారని కునాల్ జైన్ పేర్కొన్నారు. ఒక ఎన్ఆర్ఐగా నిస్సహాయంగా, హృదయ విదారకంగా అనిపించింది. ఇది మానవ విషాదమని పేర్కొంటూ అమెరికాలోని భారత రాయబార కార్యాలయాన్ని ట్యాగ్ చేశారు. ఉగ్రవాది పట్ల కూడా ఇంత క్రూరంగా వ్యవహరించరని మండిపడ్డారు. ఈఘటనపై దర్యాప్తు చేపట్టి, విద్యార్థికి సహాయం అందించాలని కోరారు. ఈ ఘటనపై న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం సోమవారం స్పందించింది. న్యూవార్క్ లిబర్టీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక భారతీయుడు ఇబ్బంది ఎదుర్కొన్న వీడియో వెలుగుచూసింది. ఈ అంశంపై స్థానికఅధికారులతో సంప్రదిస్తున్నాము. భారతీయ పౌరుల సంక్షేమం కోసం కాన్సులేట్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొంది. ఈ ఘటన వలసలదారులపై కఠిన చర్యల పేరుతో అమెరికా అధ్యక్షులు ట్రంప్ వందలాది మంది భారతీయ విద్యార్థులను భారతదేశానికి పంపిన తీరును గుర్తుకు తెచ్చింది.

# న్యాయవ్యవస్థపై సడలుతున్న నమ్మకం



గత మార్చి నెలలో ఢిల్లీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార నివాసంలో భారీ స్థాయిలో కాలిపోయిన నోట్ల కట్టల ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ దృశ్యాలన్నీ ప్రముఖ టివి ఛానల్లలో ప్రసారమవ్వడమే కాకుండా అన్ని పత్రికలు పతాక శీర్షికన ఆ వార్తను ప్రచురించడంతో న్యాయ వ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకున్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాక అపనమ్మకం కలిగించే ఇలాంటి సంఘటనల గురించి ప్రజలు పలు విధాలుగా చర్చించుకునేందుకు తావివ్వడంతో పాటు ఇలాంటి సంఘటనలు అన్ని వ్యవస్థల్ని అసంతృప్తికి గురిచేస్తాయని వారు వాపోతున్నారు. సగటు పౌరుని అనుమానాన్ని నివృత్తి చేయడం ద్వారా న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం దిద్దుబాటు చర్యలకు పూనుకుంటోంది. దాని కోసం వడివడిగా అడుగులు వేస్తోంది. అందుబాటులో ఉన్న అన్ని అస్త్రాలను సంధించి జస్టిస్ వర్మను సాగనంపడానికి సిద్ధపడుతోంది. జస్టిస్ వర్మ ఇంట్లోకి ఆ నోట్లకట్టలు ఎలా వచ్చాయి? ఎవరిచ్చారు? అనే దానిపై విచారణ చేపట్టడానికి కోర్టులు అనుమతించలేదు. ఎఫ్ఐఆర్ చేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. సుప్రీం కోర్టు ఎలాంటి బహిరంగ ప్రకటన చేయనప్పటికీ సుప్రీం కోర్టుయే చొరవ తీసుకుని ఇన్ హౌస్ కమిటీ ని వేసి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వర్మకు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. సుప్రీం కోర్టు జస్టిస్ వర్మను ఢిల్లీ నుండి అలహాబాద్ కోర్టుకు బదిలీ చేసింది. ఆయన అలహాబాద్‌కు వస్తే బహిష్కరిస్తామని అక్కడి బార్ కౌన్సిల్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఆయన రావడం రిపోర్టు చేయడం జరిగిపోయినప్పటికీ కేసులు అసైన్ చేయలేదు. అలా చేయడం న్యాయవ్యవస్థపై ప్రజల మనసులలో తొలుస్తున్న అనుమానాలకు సమాధానం కాదని పలువురు న్యాయకోవిదులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే అంశంపై ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ కూడా రెండోసారి వ్యాఖ్యానించడం ఈ సంఘటన ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నదో అవగతమవుతున్నది. వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా ఉంచాలనే ఉద్దేశంతోనే అభిశంసన తీర్మానం అనేది రాజ్యాంగంలో ప్రవేశపెట్టబడింది. ఈ అభిశంసన అనేది హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయమూర్తుల పారదర్శకతపై అనుమానాలు, విమర్శలు, ఆరోపణలు తలెత్తినప్పుడు వారిని తొలగించేందుకు చేపట్టే ప్రక్రియ. ఇది చట్టపరంగా పార్లమెంటుకు ఉన్న ప్రత్యేకమైన వెసులుబాటు. ఈ ప్రక్రియను జడ్జెస్ ఎంక్వయిరీ యాక్ట్ 1968 ద్వారా చేపడతారు. లోక్‌సభలో అయితే కనీసం 100 మంది, రాజ్యసభ అయితే 50 మంది సభ్యులు ఈ తీర్మానం మీద సంతకం చేయాలి. రాజ్యసభ చైర్మన్ లేదా లోక్‌సభ స్పీకర్ చేత నియమించబడ్డ విచారణ కమిటీ ద్వారా నివేదిక ఇవ్వబడుతుంది. ఆ నివేదిక ద్వారా న్యాయమూర్తి దోషిగా తేలితే దానిని పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టబడి మూడింట రెండోవంతు మెజారిటీతో ఆమోదించబడితే రాష్ట్రపతి సదరు న్యాయమూర్తిని తొలగిస్తారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఆ మెజారిటీ సాధించడం అధికార పక్షానికి పెద్ద కష్టమేమీ కాదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. విపక్షాలపై ఆధారపడకుండానే అభిశంసన ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ వర్మ తీరును విపక్షాలు సైతం తప్పు పడుతుండడంతో అభిశంసనకు మరింత బలం చేకూరడం తథ్యమని విమర్శకులు సైతం విశ్లేషిస్తున్నారు. యశ్వంత్ వర్మ కేసు విషయంలో సుప్రీం కోర్టు నియమించిన ఇన్ హౌస్ కమిటీ నివేదికలో భారీ మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టల ఆధారాన్ని బలంగా పేర్కొనడంతో అభిశంసనకు మరింత మద్దతు పెరగడం ఖాయమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు అభిశంసన ప్రక్రియలు చాలా అరుదుగానే జరిగాయి. 1991లో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వి రామస్వామిపై ఆర్థిక అవకతవకల ఆరోపణలతో లోక్‌సభలో 108 మంది సభ్యులచే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టబడినప్పటికీ కాంగ్రెసు గైర్హాజరు కావడంతో ఈ తీర్మానం వీగిపోయింది. ఆయన పూర్తికాలం కొనసాగినప్పటికీ ఆయనకు కేసులు మాత్రం అసైన్ చేయలేదు. ఇక 2011లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా సేన్ పై ఆర్థిక అవకతవకలపై రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టబడి ఆమోదించబడింది. లోక్‌సభలో ఓటింగ్‌కు ముందే ఆయన రాజీనామా చేయడంతో ఆ వివాదం అంతటితో ముగిసిపోయింది. 2017లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి నాగార్జున్ రెడ్డిపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టబడినప్పటికీ కొంతమంది ఎంపిలు తమ సంతకాలను ఉపసంహరించడంతో అది కూడా వీగిపోయింది. 2018లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై రాజ్యసభలో విపక్షాలన్నీఏకమై రాజకీయపరమైన అభిప్రాయాలతో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ రాజ్యసభ చైర్మన్ దాన్ని ప్రాథమిక దశలోని తిరస్కరించడంతో తీర్మానం ముందుకు పోలేదు. ఇలా వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమేనని చీకట్లో ఇంకా ఎన్ని ఉన్నాయోనని ప్రజాస్వామికవాదులు గుసగుసలాడుకుంటున్నారు. రాజ్యాంగపరమైన అంశాలపై ఇటీవల దాఖలైన పలు పిటిషన్లను నామమాత్రమైనా పరిశీలించకుండానే ఆదిలోనే కొట్టివేయడాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా నిలిచే పార్లమెంటును సైతం న్యాయమూర్తుల నియామకంలో భాగస్వామ్యం చేయకపోవడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోపక్క స్వయం ప్రతిపత్తి అనే పేరున న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తుల నియామకాన్ని న్యాయమూర్తులే చేపట్టడం వల్ల పారదర్శకత లోపిస్తున్నదని, జవాబుదారీతనం అడుగంటుతుండడమేకాక 'అంకుల్ జడ్జ్ సింద్రోమ్' వల్ల తమ అనుయాయులకే పెద్దపీట వేసే అవకాశం ఉన్నదని న్యాయ కోవిదులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని అధిగమించడానికి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకువచ్చిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ తరహాలో సరికొత్త కమిషన్ ను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని రాజ్యాంగ నిపుణులు సైతం కోరుతున్నారు. మొత్తం మీద పూర్తిస్థాయిలో వ్యవస్థను ప్రక్షాళన చేసి సగటు భారతీయునిలో రాజ్యాంగం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల గౌరవాన్ని పెంపొందించే విధంగా అడుగులు పడతాయని ఆశిద్దాం!

# చచ్చేటంత అభిమానం దేనికి

వినోదాన్ని విషాదంగా మారుస్తున్న సంఘటనలు దేశంలో తరచూ జరగడం ఇప్పుడు మనం చూస్తున్నాం. ముఖ్యంగా ప్రజలకు వినోదాన్ని అందించే సినిమా, క్రికెట్ రంగాలకు చెందిన నటులకోసం, క్రీడాకారులకోసం ప్రాణాలు పోగొట్టుకునే స్థితికి చేరుకుంటున్నారు అభిమానులు. ఇప్పుడు మతం, రాజకీయాలు, సినిమా, క్రికెట్.. ఈ నాలుగింటి చుట్టే ప్రపంచం తిరుగుతున్నట్టుగా కనిపిస్తుంది మనకు. జరుగుతున్న సంఘటనలు చూస్తే మితిమీరిన అభిమానం కారణంగా మతసంబంధమైన సభలు, రాజకీయ సభలు, సినిమా ఈవెంట్లు, క్రికెట్ మ్యాచ్‌ల కోసం జమగూడే ప్రజలు ప్రమాదాలకు గురికావడం, విలువైన ప్రాణాలు కోల్పోవడం, ఉజ్వల భవిష్యత్తును అర్ధంతరంగా ముగింప చేసుకోవడమే కాకుండా కుటుంబాలకు తీవ్ర దుఃఖాన్ని మిగులుస్తున్నారు. మూడు రోజుల క్రితం బెంగళూరులో చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట సంఘటన చూసిన తర్వాత వీటిని అరికట్టవలసింది ఎవరు? జాగ్రత్తలు తీసుకోవాల్సింది ఎవరు? పదేపదే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నా ముందు జాగ్రత్త చర్యలు లేకపోవడానికి కారకులెవరు? అన్న అంశాలమీద తీవ్రమైన చర్చ జరుగుతున్నది. ఈ సంవత్సరం ఆరంభంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనలో అధికారికంగా మృతుల సంఖ్య 30గానే ప్రకటించినా ఇంకా చాలామంది చనిపోయి ఉంటారని పరిశీలకులు, మీడియా చెప్తున్న విషయం. కోట్లమంది పాల్గొనే ఇటువంటి కార్యక్రమంలో 30 మంది చనిపోతే విశేషమేముందని ఎవరైనా వాదించవచ్చు. కానీ, ఎవరూ అసహజ మరణానికి గురికాకూడదన్న స్పృహ లేనివారే అలా మాట్లాడతారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గతంలో కూడా మనం తొక్కిసలాటలు, మరణాలకు సంబంధించిన వార్తలు విన్నాం. పదేళ్లక్రితం గోదావరి పుష్కరాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి రాష్ట్ర అధినేత ప్రచారంకోసం చేసిన ఆర్భాటం కారణంగా జరిగిన తొక్కిసలాటలో దాదాపు 30 మంది మరణించిన విషయం తెలిసిందే. రాజకీయ సభల్లోనూ జాగ్రత్తలు తీసుకోని కారణంగా జరిగిన విషాదాలు అనేకం. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికలకు ముందు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అధినేత నెల్లూరు జిల్లాలోని కందుకూరు అనే చోట తన సభకు వచ్చిన జనం అధిక సంఖ్యలో కనిపించడం కోసం చేసుకున్న ఏర్పాట్ల కారణంగా జరిగిన తొక్కిసలాటలో ఎనిమిదిమంది మరణించారు. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని ముక్తి పొందాలనుకున్న భక్తులు టికెట్ల కోసం ఏర్పాటైన క్యూలో నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారు. తాజాగా ఇంకా మన జ్ఞాపకాల్లోంచి తొలగిపోని సినిమా సంఘటన హైదరాబాద్‌లో జరిగింది. ఓ ప్రముఖ నటుడు తన సినిమా ప్రీమియర్ షోకు వెళ్తే, ఆయనను చూడడానికి ఎగబడిన అభిమానుల మధ్య జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందడం, మరొక బాలుడు గాయాలపాలై నెలల తరబడి స్పృహ లేకుండా ఆసుపత్రిలో పడి ఉండడం చూశాం. ఇప్పుడు ఐపిఎల్ విజేతలైన బెంగళూరు రాయల్ చాలెంజర్స్ ఆటగాళ్ళను అభినందించడం కోసం బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోయారు. 11 మంది ఆడే క్రికెట్ ఆట ఓ 11మంది ప్రాణాలు తీయడానికి దారి తీసింది. మత సంబంధమైన కార్యక్రమాల్లో గాని, రాజకీయ సభల్లో గాని, సినిమా ఫంక్షన్లలో గాని, క్రికెట్ స్టార్లను చూడడానికి ఎగబడిన జనసందోహంలో గానీ ప్రాణాలు కోల్పోతున్నవాళ్ళు ఎవరు? వాళ్ళను ఆయా సందర్భాలకు తగిన పేర్లతో పిలుచుకుంటాం. మత సంబంధమయిన కార్యక్రమాలలో పాల్గొంటే భక్తులని, రాజకీయ సభలయితే కార్యకర్తలు, ప్రజలు అని, సినిమా ఫంక్షన్లయితే ప్రేక్షక దేవుళ్ళు, క్రికెట్ ఆట చూడటానికి వెళితే క్రీడాభిమానులు అని. అయితే మొత్తంగా వీళ్లంతా మనుషులు. చదువుకుని పైకి రావలసిన వాళ్ళు, తమ కుటుంబాలకు ఆధారంగా ఉండవలసిన వాళ్ళు, ఎన్నో బాధ్యతలు మోస్తున్నవాళ్ళు అయి ఉంటారు. ఎందుకు ఇది రోజురోజుకు ఇలా పెరుగుతున్నది? వ్యక్తులు, వ్యవస్థ దీనిగురించి ఆలోచించి బెంగళూరు సంఘటన తర్వాత మరొక్క మనిషి కూడా ఇలా అసహజ మరణానికి గురికాకుండా చూడాల్సిన అవసరం ఉన్నది. బెంగళూరు విషాదంలో మరణించినవారిలో 13 ఏళ్ల బాలిక తప్ప అంతా 19 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు వాళ్లే. ఒక్కరు మాత్రమే 35 సంవత్సరాల వ్యక్తి. వీరంతా తమ కుటుంబాలకు విషాదం మిగిల్చి తరలిపోయారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందినవాళ్లే. రోజు కూలి చేసుకునే, పానీ పూరి అమ్ముకొని జీవించే, కష్టం చేసుకుని బతికే తమ తల్లిదండ్రులకు మంచి జీవితం ఇవ్వడం కోసం ఉన్నత చదువులు చదువుకుంటున్నవాళ్లు. ఇప్పుడా కుటుంబాలకు దిక్కెవరు? పోనీ, అదేమీ భారతజట్టు ప్రపంచ కప్ గెలుచుకొచ్చిన సందర్భం కాదు. అది ప్రజలకు ఉచితంగా వినోదాన్ని అందించే క్రీడగా కూడా లేదు. అదొక వ్యాపారం. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అనే ఒక ఫ్రాంచైజీ టీం. డబ్బుగలవారు ఇటువంటి టీంలను కొనుక్కుని ఆడించి మరింత డబ్బు, పలుకుబడి సంపాదించుకునే ఆట. ఆ జట్టు బెంగళూరు తరఫున ఆడి గెలిచింది కాబట్టి బెంగళూరులో సంబరాలు చేసుకున్నారు అనుకోవచ్చు. జట్టు గెలిచిన రోజు రాత్రి హైదరాబాద్ నగరంలో సచివాలయం ఎదుట నెక్లెస్ రోడ్‌లో జరిగిన ఉన్మాద ప్రదర్శనను ఎలా చూడాలి? ఇది దురభిమానానికి పరాకాష్ఠ. అక్కడ మెట్రో రైల్ బ్రిడ్జి కింద క్రికెట్ అభిమానులు బాణాసంచా కాల్చి జనం మీదకు తిప్పుతూ తమ ఉన్మాదాన్ని ప్రదర్శించారు. ఆ గెలిచింది హైదరాబాద్ జట్టు కాదు, అందులో ఒక్క హైదరాబాద్ ఆటగాడైనా లేదు. అటువంటప్పుడు హైదరాబాద్‌లో ఎందుకీ ఉన్మాద ప్రదర్శన? క్రికెట్ అనే క్రీడకు అభిమానులు ఎక్కడైనా ఉంటారు. ఇది ప్రపంచ స్థాయి క్రీడ అనుకుంటే దానిపట్ల రోజురోజుకూ పెరుగుతున్న దురభిమానం ఉన్మాదస్థాయికి చేరుకోవడం చూస్తున్నాం. బెంగళూరు సంఘటననే తీసుకుంటే విజయోత్సవం ఏర్పాటుచేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు యాజమాన్యం, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ మాత్రమే ఈ దుర్ఘటనకు బాధ్యత వహించాలా? రాష్ట్ర ప్రభుత్వానికి, దాని అధీనంలో పనిచేసే పోలీసు వ్యవస్థకు ఏం సంబంధం లేదా? నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నా, తీసుకోకపోయినా ఆ కార్యక్రమం జరగబోతున్నట్టుగా ముందుగానే ప్రకటించి ఉన్నారు. అంతేకాకుండా ఉచిత ప్రవేశం అనే ప్రచారం కూడా జరిగిన కారణంగా అభిమానులు పెద్దసంఖ్యలో గుమికూడబోతున్నారని పోలీస్ శాఖ ఊహించకపోవడం, కట్టుదిట్టమైన చర్యల కోసం తగిన బలగాలను అక్కడ మోహరించకపోవడం కచ్చితంగా పోలీస్ శాఖ వైఫల్యం కిందకే వస్తుంది. ఇటువంటి సంఘటనలు మామూలే అన్నట్టుగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు గతంలో ఇంకెక్కడో తమ వైరిపక్షాలు అధికారంలో ఉన్నచోట జరిగిన సంఘటనలను ఉదహరించడం సబబు కాదు. దీనికి సంబంధించి హైదరాబాదులో ఆ రాత్రి జరిగిన సంఘటన మీద నగర కొత్వాల్ సివి ఆనంద్ చేసిన ఒక ట్వీట్‌కు స్పందిస్తూ ఒక పౌరుడు ఇలా ముందు సమాచారం లేకుండా వీధిలోకి వచ్చి జనానికి ఇబ్బంది కలిగించే మూకలను వీడియోలలో గుర్తించి వారి మీద సంబంధిత సెక్షన్లకింద కేసులు నమోదు చేయవచ్చునని సూచించారు. క్రికెట్ అభిమానులే కాదు, వివిధ సందర్భాల్లో ఇలా వేళ కాని వేళలో, ఎటువంటి భద్రతా చర్యలకు అవకాశం లేని విధంగా జనానికి ఇబ్బందులు కలిగించే వారి మీద కనీస చర్యలు ఉంటే తప్ప ఇటువంటి వారి కట్టడం సాధ్యం కాదు. పరిపాలన వ్యవస్థ.. ముఖ్యంగా పోలీస్ శాఖ ఈ దిశగా ఆలోచన చేస్తే భవిష్యత్తులో మరిన్ని సంఘటనలు జరగకుండా, మరికొంతమంది అమాయకంగా ప్రాణాలు పోగొట్టుకోకుండా చూసినవాళ్ళు అవుతారు. భక్తులు, అభిమానులు, కార్యకర్తలు కూడా సీరియస్‌గా ఆలోచించాల్సిన విషయం ఒకటి ఉంది. నాయకులు, మతగురువులు, సినిమాస్టార్లు, క్రికెట్ హీరోలు బాగానే ఉంటారు, హద్దులు మీరిన అభిమానం ప్రదర్శించడంవల్ల వ్యక్తిగతంగా నష్టపోయేది అభిమానులే. హైదరాబాదులోని సంధ్యా థియేటర్ దగ్గర జరిగిన సంఘటన తదనంతర పరిణామాలు ఇందుకు మంచి ఉదాహరణ. ఆనాటి తొక్కిసలాటకు కారణం అయిన నటుడిమీద పోలీసులు కేసు పెట్టి ఒకటి రెండు రోజులు హడావిడి చేసినా ఆ తర్వాత అందరూ ఆ విషయాన్ని మర్చిపోయారు. అంతేకాదు, అదే పోలీసు వ్యవస్థ మీద అజమాయిషీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సినిమా అవార్డుల కమిటీ ఆ నటుడిని అదే సినిమాకు ఉత్తమ నటుడి అవార్డుకు ఎంపిక చేసింది. ప్రాణం పోగొట్టుకున్నది అభిమాని, అవార్డు గెలుచుకున్నది అందుకు కారకుడైన నటుడు. ఇదీ పరిస్థితి.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు.. పలు జిల్లాల్లో ఘర్షణలు



ఇంఫాల్ : మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. పలు జిల్లాల్లో భద్రతాదళాలకు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చెలరేగాయని మంగళవారం పోలీస్ అధికారులు తెలిపారు. మైతీ తెగకు చెందిన స్వచ్ఛంద సంస్థ అరంబై తెంగల్ (ఎటి) నేత కనన్ సింగ్ సహా అరెస్ట్ చేసిన మరో నలుగురిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు గత రెండు రోజుల నుండి ఆందోళనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురై లామ్లాంగ్ ప్రాంతంలో ఘర్షణలు చెలరేగాయి. నిరసనకారులను చెదరగొట్టేందుకు భద్రతా దళాలు టియర్‌గ్యాస్, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించారు. ఈ ఘటనలో నిరసనకారులు ఒక వాహనాన్ని తగులబెట్టారని పోలీసులు తెలిపారు. తౌబాల్ మరియు కాక్చింగ్ జిల్లాల్లో రహదారులను దిగ్బంధించారని, టైర్లు తగలబెట్టారని అన్నారు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని తేరా ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు భద్రతాదళాలపై ఏడు రౌండ్లు కాల్పులు జరిపడంతో ఉద్రిక్తతలు చెలరేగాయని అన్నారు. నిందితుల కోసం పారామిలటరీ దళాలు గాలింపు చర్యలు చేపట్టాయని అన్నారు. బిష్ణుపూర్‌జిల్లాలోని నంబోల్‌లో నిరసనకారులతో జరిగిన ఘర్షణలో ఇద్దరు పోలీస్ సిబ్బందికి స్వల్పగాయాలయ్యాయని, ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అన్నారు.

## ఢిల్లీకి సీఎం సిద్ధరామయ్య.. బెంగళూరు తొక్కిసలాటపై చర్చ?



న్యూఢిల్లీ: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్‌ను కలవనున్నారు. జూన్ 4న బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందిన ఘటనపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం చర్చించనున్నారని సమాచారం. ఈ తొక్కిసలాట ఘటన దరిమిలా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలకు గురైంది. ఈ ఘటనకు సీఎం, డిప్యూటీ సీఎం ఇద్దరూ ప్రత్యక్షంగా బాధ్యులని ఆరోపిస్తూ, వారు రాజీనామా చేయాలని కోరుతూ ప్రతిపక్ష బీజేపీ, జేడీ(ఎస్)లు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్‌ను కలుసుకోనున్న సిద్ధరామయ్య, డీకేఎస్‌లు ఆర్‌సీబీ విజయోత్సవ ఘటన తొక్కిసలాట పూర్వాపరాలపై సమగ్రంగా చర్చించనున్నారు. 'సిద్ధరామయ్య ఢిల్లీలో పార్టీ నాయకత్వాన్ని కలుస్తారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలపై వారికి వివరిస్తారు' అని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవలే గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) అధికారులతోపాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం నేడు తిరిగి ఢిల్లీకి వెళుతున్నారు. జూన్ నాలుగున సాయంత్రం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతి చెందారు. ఆర్సీబీ జట్టు విజయోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. నాటి తొక్కిసలాట ఘటనలో 56 మంది గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి కాంగ్రెస్ హైకమాండ్ తన నుండి సమాచారం కోరిందనే వార్తలను సిద్ధరామయ్య తోసిపుచ్చారు. కాగా నేటి అధిష్టానం భేటీలో గవర్నర్ ఎంపిక నామినేషన్ల కోసం సిఫార్సు చేసిన నాలుగు పేర్లు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

## 'మహిళా హెూంమంత్రి ఉన్న రాష్ట్రంలో మహిళలపై దారుణాలు'



చిత్తూరు జిల్లా: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ మహిళా నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలపై ఇన్ని అరాచకాలు జరుగుతుంటే హెూంమంత్రి అనితకు చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. అధికారంలో ఉన్నవాళ్లు లా అండ్ ఆర్డర్ కాపాడాలని, మరి అటువంటిది అధికారంలో ఉన్నవాళ్లే రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ రోజు(మంగళవారం, జూన్ 10) ఆర్‌కే రోజా మాట్లాడుతూ.. 'మహిళ హెూం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళలు పై దారుణాలు జరగడం సిగ్గుచేటు. నగరి నియోజకవర్గం లో మైనర్ బాలికపై అత్యాచారం చేశారు. అనంతపురం జిల్లా ఇంటర్ విద్యార్థి కనిపించకపోతే పట్టించుకోలేదు. పరిటాల సునీత నియోజకవర్గంలో 14 మంది టీడీపీ వాళ్లు మైనర్ బాలికపై అత్యాచారం చేస్తే సాక్షి మీడియా బయటకు తీసుకు వచ్చింది. డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ మహిళలు పై దాడులు జరుగుతుంటే పట్టించుకోవడం లేదు. హెూం మంత్రి అనిత నా చేతిలో గన్ ఉందా, నాకు పవర్ ఉందా.. అంటూ చేతకాని మాటలు మాట్లాడుతూ ఉంటే రాజీనామా. చేయాలి. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేనిని తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేశారు. కొమ్మినేని శ్రీనివాసరావు పై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టడం దారుణం. క్షమాపణ అంటూ చెప్పాల్సి వస్తే మొదటగా చంద్రబాబు చెప్పాలి, ఆడబిడ్డ పుట్టుక గురించి తప్పుగా మాట్లాడిన చంద్రబాబు క్షమాపణ చెప్పాలి. ఆడపిల్ల కనిపిస్తే ముద్దు పెట్టాలి, లేదంటే కడుపున చేయాలి అని మాట్లాడిన బాలకృష్ణ పై కేసు పెట్టాలి అన్న ఆయనపై కేసు పెట్టాలి' అని రోజా తెలిపారు. జగన్ అన్న లండన్ వెళ్తే తప్పుడుడు వాఖ్యలు చేసిన నారా లోకేష్ పై ముందు కేసు పెట్టాలి. మూర్తి, రేణుక చౌదరి మాట్లాడిన మాటలు పై ఎందుకు కేసు నమోదు చేయాలేదు. బి.ఆర్.నాయుడు పై ఎందుకు కేసు పెట్టలేదు. కొమ్మినేని శ్రీనివాసరావు పై ఎప్పటి నుంచో కక్ష గట్టి చంద్రబాబు అరెస్ట్ చేయించారు. జూన్ 6 తేదీ ఈ డిస్కషన్ జరిగింది, కొమ్మినేని క్షమాపణ చెప్పారు. లోకేశ్, చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేశారు. ఒక పథకం ప్రకారం యాక్షన్ ప్లాన్ తో సాక్షి పైన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పై బురద జల్లారు. ఎల్లో మీడియా ద్వారా విష ప్రచారం చేయించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ పాల్పడుతోంది' అని ధ్వజమెత్తారు ఆర్‌కే రోజా.

## ఎమ్మెల్సీ కవిత అరెస్ట్..




హైదరాబాద్: విద్యార్థులు, జనరల్ బస్‌పాస్‌ల చార్జీలను తాజాగా తెలంగాణ ఆర్టీసీ పెంచిన దాదాపు దాదాపు 20 శాతం విషయం తెలిసిందే. దీంతో ప్రజలు, విద్యార్థులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భవన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో బస్ పాస్ ధరల పెంపునకు నిరసనగా ఇవాళ బస్ భవన్ ముట్టడికి యత్నించారు. పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలతో కలిసి బస్ భవన్ ఎదుట ఎమ్మెల్సీ కవిత బైటాయించారు. ఈ క్రమంలోనే ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ.. వెంటనే ఆర్టీసీ పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై ప్రభుత్వం పెనుభారాన్ని మోపిందని మండిపడ్డారు. విద్యార్థులు, చిరుద్యోగులపై తీవ్రంగా ఆర్థిక భారం పడుతుందని, బస్‌పాస్ ధరలను పెంచి ప్రజలపై గుదిబండను మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పెంపుతో ఒక్క ప్రయాణికుడిపై నెలకు దాదాపు రూ. 300 పైగా భారం పడుతుందని అంచనా వేశారు. మరోవైపు అనేక రూట్లలో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం అలవాటు పడిందన్నారు. ఎమ్మెల్సీ కవితను తొలుత చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. ఇప్పుడు కంచన్ బాగ్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇంతకు ఏ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారో స్పష్టంగా చెప్పడం లేదని పోలీసులపై తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఘర్షణల మధ్య చిక్కుకొని విలవిలలాడుతున్న ఈశాన్య రాష్ట్రం



తుపాను ముందర ప్రశాంతత అంటే ఇదేనేమో! కొద్దివారాలుగా మణిపుర్ కొంత ప్రశాంతంగా ఉందని భ్రమిస్తున్నంత సేపు పట్టలేదు... ఆ రాష్ట్రం మరోసారి భగ్గుమంది. గత రెండేళ్ళుగా జాతి ఘర్షణల మధ్య చిక్కుకొని విలవిలలాడుతున్న ఈశాన్య రాష్ట్రం మళ్ళీ పతాక శీర్షికలకు ఎక్కింది. 2023 అల్లర్ల వేళ అనేక నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలను ఎదుర్కొంటున్న మైతేయ్‌ల ర్యాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' (ఏటీ) నేత కనాన్ సింగ్‌ను సీబీఐ అరెస్ట్ చేయడంతో ఆదివారం ఉద్రిక్తత పెచ్చరిల్లింది. భగ్గుమన్న నిరసనల మధ్య రాష్ట్రంలో పలుచోట్ల కర్ఫ్యూ, అయిదు రోజుల పాటు ఇంటర్నెట్‌పై నిషేధం విధించాల్సి వచ్చింది. వివిధ పార్టీల ఎమ్మెల్యేలు 23 మంది ఆదివారం వెళ్ళి, గవర్నర్‌ను కలసి పరిస్థితిని వివరించి, సామరస్యపూర్వక పరిష్కారానికై అర్థించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వెరసి, కేంద్రం సుదీర్ఘ జాప్యం తర్వాత ఫిబ్రవరిలో ఎట్టకేలకు అసమర్థ బీరేన్ సింగ్ సర్కార్‌ను తప్పించి రాష్ట్రపతి పాలన విధించిందన్న మాటే గానీ, మణిపుర్‌ను యథాపూర్వ స్థితికి తీసుకురాలేకపోయింది. తాజా పరిణామాలే అందుకు నిలువెత్తు నిదర్శనం. మైతేయ్‌లకు ఎస్టీ హెూదాను ఇవ్వడాన్ని కుకీ వర్గ ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించడం రెండేళ్ళ క్రితం జాతుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఆర్థిక ప్రయోజనాలు, భూయాజమాన్యంపై అసలే దీర్ఘకాలంగా రెండు వర్గాల మధ్య నెలకొన్న అసంతృప్తి ఆ తాజా పరిణామంతో మరింత చిచ్చు రేపింది. అలా 2023 మే 3 నుంచి రాష్ట్రం అక్షరాలా తగలబడుతూనే ఉంది. ఈ ఘర్షణల వల్ల 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. బీరేన్ సింగ్ సారథ్యంలోని అప్పటి బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల రీత్యా ఒక వర్గానికి కొమ్ము కాస్తూ, పక్షపాతధోరణితో వ్యవహరించినట్టు ఆది నుంచీ ఆరోపణలున్నాయి. చివరకు భద్రతా దళాలు సైతం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినట్టు వార్తలొచ్చినసంగతి మర్చిపోలేం. ప్రజలు, ప్రతిపక్షాల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా, బీరేన్‌ను మార్చడానికి ఇష్టపడని బీజేపీ అధిష్ఠానం తీరా గత ఫిబ్రవరిలో ఆయనను పక్కకు తప్పించినా పుణ్యకాలం గడిచిపోయింది. 2022 ఫిబ్రవరి నాటి ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ మద్దతు కూడగట్టుకొని అధికారం చేపట్టినా, పట్టుమని పదిహేను నెలలకే రాష్ట్రంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. మొత్తం 60 మంది సభ్యు లున్న మణిపుర్ అసెంబ్లీలో నిజానికి బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలున్నారు. రాష్ట్రం అతలాకుతల మవుతున్న వేళ... బీరేన్ స్థానంలో అన్ని వర్గాలకూ అనుకూలుడైన కొత్త వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టి, రాష్ట్రపతి పాలనను నివారించి ఉండవచ్చు. కానీ, సీఎం అభ్యర్థిపై సొంత పార్టీలోనే ఏకాభిప్రాయం కుదరలేదు. పైగా, కుకీ-జో వర్గానికి చెందిన పార్టీ ఎమ్మెల్యేలు ఏడుగురు ఘర్షణలు మొదలైన నాటి నుంచి సభకు దూరంగా ఉండడం ఆ పార్టీకి తలనొప్పిగా తయారైంది. చివరకు, ఘర్షణలు మొదలైన 21 నెలల తర్వాత రాష్ట్రపతి పాలనే శరణ్యమైంది. కానీ, అప్పటికే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టయింది. ఈశాన్య భారత అభివృద్ధికి తామే బాటలు వేస్తున్నామంటున్న పాలక పార్టీ మణిపుర్ వ్యవహారాన్ని సరైన రీతిలో చక్కదిద్దలేకపోయిందన్న శాశ్వత అప్రతిష్ఠను మూటగట్టుకోవాల్సి వచ్చింది. రాష్ట్రపతి పాలన విధించినా, పర్వత ప్రాంత రాష్ట్రంలో పరిస్థితి నేటికీ నివురు గప్పిన నిప్పులానే ఉందని శని, ఆదివారం నాటి ఘటనలు మరోమారు ఋజువు చేశాయి. అక్కడి ఉద్రిక్తతను ప్రపంచానికి నివేదిస్తున్న విలేఖరులు సైతం శనివారం భద్రతా బలగాల దాడికి గురయ్యారు. పాత్రికేయులపై రాష్ట్రంలో పదే పదే జరుగుతున్న దాడులకు నిరసనగా చివరకు సోమవారం మణిపుర్‌లోని ప్రధాన పత్రికలన్నీ తమ పేపర్‌లో సంపాదకీయ స్థానాన్ని ఖాళీగా వదిలేశాయి. పత్రికలన్నీ సమష్టిగా నిలిచి ఇలా అరుదైన రీతిలో తమ నిరసన తెలియ జేయడం ఓ బలమైన సందేశం. మణిపుర్‌లో ఇప్పటికీ మామూలు పరిస్థితులు లేవనడానికి ప్రతీక. అసలు రెండేళ్ళ క్రితం ఘర్షణలు చెలరేగగానే ఆ ఏడాది జూన్ 4న కేంద్రం ముగ్గురు సభ్యుల విచారణ సంఘం వేసింది. పదే పదే పొడిగింపుల ప్రహసనంతో సదరు సంఘం కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ దాకా దేకింది. అప్పటికైనా ఆ సంఘం కొత్తగా తేల్చేదేమిటో, దాని నివేదికతో ఒరిగేదేమిటో చెప్పలేం. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిందని 2023 ఆగస్టులో సుప్రీమ్ కోర్ట్ వ్యాఖ్యానించినా మన ఏలికలకు చీమ కుట్టినట్టయినా లేదు. నష్టనివారణలో చిత్తశుద్ధి కరవైంది. రాష్ట్రపతి పాలనతో పరిస్థితి మెరుగువతుందనుకుంటే అడియాసైంది. గవర్నర్ సైతం ఇంఫాల్ విమానాశ్రయం నుంచి ఇంటికి హెలికాప్టర్‌లో వెళ్ళాల్సిరావడం దిగ్భ్రాంతికరం. సాక్షాత్తూ బీజేపీ ఎంపీ ఒకరు 2020లో స్థాపించిన 'ఏటీ' సాయుధ పౌరసైన్యంగా మారి హింసకు పాల్పడి, ఆయు ధాలను కొల్లగొట్టినట్టు కథనం. ఎవరెన్నిమార్లు అభ్యర్థించినా, ఇప్పటికీ ఆయుధాలను అప్పగించ లేదు. రేపు అవి మరే నేరగాళ్ళ చేతిలో పడి, ఎక్కడకు దారి తీస్తాయో ఊహించలేం. గతంలో పలు తీవ్రవాద వర్గాలు నిషేధానికి గురైనా, ఇప్పటికీ ఏటీని ఎందుకు నిషేధించలేదంటే జవాబూ లేదు. ఇంత జరుగుతున్నా ప్రధాని పెదవి విప్పకపోవడం, ప్రపంచమంతా తిరుగుతున్నా ఈశాన్యంలో పర్యటించి భరోసా ఇవ్వకపోవడం సమర్థించలేం. ఇప్పటికైనా తీవ్రతను గుర్తించి, విభిన్న వర్గాల మధ్య సామరస్యానికి కృషి చేయాలి. హింస కన్నా అభివృద్ధి ముఖ్యమని నచ్చజెప్పాలి. వేలాది సగటు మణిపురీలు అనేక నెలలుగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవాల్సి రావడం అన్ని పార్టీల సమష్టివైఫల్యం. ఇది ఇలాగే కొనసాగితే మానవత్వానికే మాయనిమచ్చ. దేశసమగ్రతకే ప్రమాదం.

# ప్రజాస్వామ్యానికి ప్రమాదం



కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పదకొండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అట్టహాసపు సంబరాలు, ప్రచారార్భాటం సాగిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జమ్మూకాశ్మీర్ రియాసిలో చినాబ్ రైల్వే వంతెనను ప్రారంభిస్తూ దేశ అభివృద్ధికి ప్రతీకగా జాతీయ జెండా పట్టుకొని మరీ వక్కాణించారు. బిజెపి శ్రేణులు ఊరూ వాడా వికసిత భారత్ పొలి కేకలు లంకించుకున్నాయి. బిజెపి 2014లో అధికారపీఠమెక్కగా ఈ పదకొండేళ్లల్లో దేశ సగటు మనిషి బతుకు ఎంత మెరుగ్గా ఉందనే ప్రశ్న తలెత్తుతుంది. మోడీ పాలనలోకొచ్చినప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో పదవ స్థానంలో ఉండగా మూడవ స్థానానికి చేరేందుకు దూసుకెళుతున్నామంటోంది బిజెపి. వాస్తవంగా ఆ పరిస్థితి ఉందా? వార్షిక వృద్ధి రేటు కొన్నేళ్లపాటు పది శాతం ఉండాలి. గతేడాది 6.5 శాతం కూడా లేదు. ఇంకా తక్కువేనని రేటింగ్ సంస్థలు చెబుతున్నాయి. కోవిడ్ అనంతరం పుంజుకోవాల్సిన వృద్ధి అప్పటికంటే దిగజారింది. అలాంటప్పుడు మూడవ ఆర్థిక వ్యవస్థ ఎలా సాధ్యం? జనాభాలో చైనాను భారత్ దాటిపోయింది. ప్రపంచబ్యాంక్ తన పేదరిక కొలమానాలను సర్దుబాటు చేసుకున్నాక కూడా మన దేశంలో 40 కోట్ల మంది పేద, మధ్యస్త ఆదాయం కలిగిన వారున్నారని అంచనా వేసింది. ఇప్పటికీ ప్రభుత్వం 80 కోట్ల మందికి ఆహార భద్రతా చట్టం కింద సబ్సిడీపై ఆహార ధాన్యాలు అందిస్తోంది. అయినా ఆకలి సూచిలో మన దేశం చిట్టచివరన కునారిల్లుతోంది. ప్రజల తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు మెరుగు కాకుండా నిజమైన వికసిత భారత్ అసాధ్యం. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను భుజానికెత్తుకున్న ఫలితంగా ఆర్థిక అసమానతలు ఆందోళనకర స్థాయికి చేరాయని ఈ కాలంలో శతకోటీశ్వరుల సంఖ్య, వారి చేతుల్లో పోగుపడిన సంపదే తెలుపుతుంది. 2022-23 ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం దేశంలో ఒక శాతం సంపన్నుల వద్ద 22.6 శాతం ఆదాయాలు, 40.1 శాతం జాతి సంపద కేంద్రీకృతమైంది. ఫోర్బ్స్ జాబితాలో 2014 నాటికి భారతీయ శతకోటీశ్వర్లు వంద మంది ఉంటే, 2024 నాటికి ఆ సంఖ్య 200కి చేరుకుంది. ప్రపంచంలోనే తీవ్ర ఆర్థిక అసమానతలు కలిగిన దేశంగా మోడీ జమానాలో ఖ్యాతికెక్కింది! కార్పొరేట్ల దోపిడీకి ప్రభుత్వం అన్ని విధాలా పని చేస్తున్నందునే వారి సంపద పోగుబడుతోంది. కార్మిక చట్టాల రద్దు, దొడ్డిదారిన నల్ల వ్యవసాయ చట్టాలు, భూములు, అటవీ, సహజవనరుల ధారాదత్తం, బ్యాంకు రుణాల రద్దు, పన్ను రాయితీలు, అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు దోచిపెడతాయి. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి తదితరాలు ప్రజలపై మోడీ ప్రభుత్వం సాగించిన దుర్మార్గపు దాడులు. నిత్యావసరాలు సహా అన్నింటి ధరలూ పెరిగాయి. పారిశ్రామిక, తయారీ రంగాలు కుదేలయ్యాయి. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. నిరుద్యోగం కొత్త రికార్డులు బద్దలు కొడుతోంది. వ్యవసాయ సంక్షోభానికి సంకేతం లక్ష మంది రైతుల, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు. ఇదీ బిజెపి పాలన సాధించిన ఘనత! ఈ కాలంలో హిందూ మతోన్మాద చర్యలకు కొదవే లేదు. జమ్మూకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్ రద్దు, సిఎఎ, బిజెపి రాష్ట్రాల్లో ఏకరూప పౌరస్మృతి, అయోధ్యలో రామాలయ నిర్మాణం, గోరక్షణ పేరిట మూకదాడులు, మసీదుల కింద ఆలయాల అన్వేషణకు సర్వేలు, మత క్రతువుల పేరిట అల్లర్లు చెప్పుకుంటూ పోతే సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో బిజెపి మద్దతుతో ముస్లిం మైనార్టీలు, క్రైస్తవుల లక్ష్యంగానే ఇవన్నీ సాగాయి. తెగల మధ్య ఘర్షణలతో మణిపూర్ రగులుతూనే ఉంది. సనాతనధర్మం పేరిట దళితులు, ఆదివాసీలు, మహిళలు, ఇతర అణగారిన తరగతులపై దాడులు ఉండనే ఉన్నాయి. రాష్ట్రాల హక్కులను హరించే, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే కుట్రలు, ప్రణాళికా సంఘం రద్దు, ఎన్నికైన ప్రభుత్వాలపై గవర్నర్ల వేధింపులు నిత్యం చూస్తున్నాం. ప్రతిపక్షాలపై సిబిఐ, ఇడి ప్రయోగం, అక్రమ కేసులు, అరెస్టులకు హద్దుపద్దు లేదు. న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్‌లను బలహీనపర్చే చర్యలు, చివరికి పార్లమెంట్‌ను సైతం హైజాక్ చేస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా పరిణమించాయి. బిజెపి పాలనలో రాజ్యాంగ మౌలిక స్వరూపానికి, పునాదులపై ఉద్దేశపూర్వక దాడి ఎక్కుపెట్టబడింది. దేశంలో నయా ఫాసిస్టు ధోరణులు వ్యక్తమవుతున్నాయి. లౌకిక, ప్రజాస్వామిక వాదులు, ప్రజలు అప్రమత్తం కావాల్సిన సమయం.

# సందేహాస్పద బనకచర్ల



రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఆకాశమే హద్దుగా హైప్ ఇచ్చి తలకెత్తుకున్న గోదావరి-బనకచర్ల భారీ నీటి పారుదల ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై ఆదిలోనే సందేహాలు చుట్టుముట్టాయి. రూ.81 వేల కోట్ల వ్యయం కాగల ఈ 'బాహుబలి' ప్రాజెక్టును స్వీయ ఆర్థిక (సెల్ఫ్ ఫైనాన్స్) ప్రాజెక్టుగా కేంద్ర ఆర్థిక శాఖ వద్ద రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికారులు పేర్కొన్నట్లు వార్తలొచ్చాయి. సెల్ఫ్ ఫైనాన్స్ అంటే ఏమిటి? ఎలా అమలు చేస్తారు? ప్రజలపై ఏమైనా భారాలు మోదుతారా? అనే విషయాలను ప్రభుత్వం బహిర్గతం చేస్తేనే ఎవ్వరికైనా అవగతమవుతుంది. వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గత డిసెంబర్‌లో బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తెచ్చిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైవేటు కంపెనీలను భాగస్వామ్యం చేస్తామన్నారు. మొన్న కేంద్రం వద్ద జరిగిన సమావేశంలో నిధుల సమీకరణపై మన అధికారులు ఇచ్చిన ప్రజంటేషన్‌లో కేంద్ర సాయం, రాష్ట్రం నిధులు, కొంత అప్పు, యాన్యుటీ నమూనాలో పని చేసే కాంట్రాక్టర్లు కొంత వెచ్చిస్తారని చూచాయగా చెప్పారు. పూర్తి నిధులు కేంద్రాన్ని అడగకుండా అప్పులు, కాంట్రాక్టర్ల నుంచి డబ్బు సమీకరిస్తామనడంతోనే ప్రైవేటు ప్రాజెక్టుగా అనిపిస్తుంది. అదే అయితే నీటి వినియోగదారులపై పన్నుల బాదుడు అనివార్యం. పోలవరం నుంచి 200 టిఎంసి గోదావరి వరద నీటిని కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ తరలించే గోదావరి-కృష్ణా-పెన్నా నదులను అనుసంధానం చేసే ప్రాజెక్టు వలన వెనకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 80 లక్షల మంది తాగునీటి అవసరాలకు, కొత్తగా ఏడున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందంటోంది ప్రభుత్వం. ఆ లక్ష్యం నెరవేరితే మంచిదే. ప్రభుత్వ చిత్తశుద్ధి, ఆచరణపైనే అనుమానం. ఇప్పటికే ఉన్న పోలవరం అనుభవం ప్రభుత్వ కార్యదక్షతను వెక్కిరిస్తోంది. రాష్ట్ర విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనగా దశాబ్దం దాటినా అతీగతీ లేదు. ఈ కాలమంతా కేంద్రంలో బిజెపి ప్రభుత్వమే అధికారంలో ఉంది. నిర్వాసితుల బాధ్యత తమది కాదని తప్పించుకుంటోంది. తమది కూటమి ప్రభుత్వమని, డబుల్ ఇంజన్ సర్కార్ అని అటు బిజెపి ఇటు టిడిపి, జనసేన చెప్పుకుంటున్నా పోలవరంపై అగమ్యగోచరమే. రూ.15 వేల కోట్ల అంచనాతో మొదలైన పోలవరం ఇప్పుడు 55 వేల కోట్లకు చేరుకుంది. భవిష్యత్తేమిటో తెలీదు. ఈ పూర్వరంగంలో డిపిఆర్, ప్రీ ఫీజిబిలిటీ నివేదికలు సైతం లేని బనకచర్ల పరిస్థితిని ఊహించడం కష్టం. కేంద్రాన్ని నిధులడగకుండా బనకచర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు యోచన అప్పుల కోసమే. అప్పులిచ్చే వారు ప్రాజెక్టుపై ఎంత రిటర్న్లు వస్తాయో తెలుసుకున్నాకనే రుణాలిస్తారు. ప్రజలపై పన్నులేస్తేనే ఆదాయం వస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయమే ఆధారం. సాగునీటి ప్రాజెక్టులతోనే సాగుకు గ్యారంటీ. రాష్ట్రంలో సాగయ్యే భూమిలో అన్ని నీటి వనరులూ కలుపుకున్నా 40 శాతం విస్తీర్ణానికే సాగునీటి వసతి ఉంది. ప్రభుత్వాలు కనబరిచిన చిన్ననీటి వనరుల నిర్లక్ష్యం వలన వాటి పరిధిలో అంతకంతకూ సాగు తగ్గుతోంది. ప్రాజెక్టులు కడుతున్నామని ఏలికలు ప్రచారం చేసుకుంటుండగా కాల్వల కింద సాగు పెరిగింది లేదు. క్రమేపి తగ్గుతోంది. రాష్ట్ర విభజన జరిగిన 2014లో కాల్వల కింద సాగు 18.82 లక్షల హెక్టార్లు కాగా నేడు 13.24 లక్షల హెక్టార్లకు క్షీణించింది. టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాల్లోనూ క్షీణత కొనసాగింది. బనకచర్ల వంటి బాహుబలి స్కీంలను చూపించి ఇతర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తారన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. వెనుకబడ్డ రాయలసీమ, ఇతర కరువు పీడిత ప్రాంతాల్లో ప్రాధాన్యత కలిగి ఇప్పటికే చేపట్టిన తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలుగొండ ఇత్యాది ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి పూర్తి చేయాలన్న డిమాండ్ సహేతుకమైనది. ప్రతిపాదిత బనకచర్ల వలన ఆయా ప్రాజెక్టులకు కృష్ణా ట్రిబ్యునల్స్ ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో కల్పించిన హక్కులకు భంగం వాటిల్లుతుందన్న ఆవేదనకు ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. తెలంగాణ ప్రభుత్వం బనకచర్లను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం నేల విడిచి సాము చేసే విన్యాసాలను విడనాడి రాష్ట్ర, వెనకబడ్డ ప్రాంతాల ప్రజల ప్రయోజనాలకు కట్టుబడాలి. ఆ దిశగా ప్రజలే ప్రభుత్వాన్ని కదిలించాలి.



నేటి ప్రభాత సూర్య జాతీయ తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

# అక్షరాలా భారత రత్నమే!

## (విశ్లేషణ)

నిదానంగా కదులుతూ... ముక్కుసూటిగా మాట్లాడుతూ... విలువలను ఎత్తిపడుతూ కూడా అన్యులకు అసాధ్యమైన సమున్నత శిఖరాలను చేరుకోవచ్చని ఆరు దశాబ్దాల తన ఆచరణతో దేశానికి చాటిచెప్పిన దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయన అక్షరాలా రత్నం. సార్థక నామధేయుడు. చెదరని వినమ్రత, సడలని దృఢ సంకల్పం, లక్ష్యసాధనకు ఎంత దూరమైనా వెళ్లే లక్షణం... విశాల టాటా సామ్రాజ్యంలో ఆయనను విలక్షణ వ్యక్తిగా నిల బెట్టాయి. కనుకనే మూడు దశాబ్దాల పాటు ఆ సామ్రాజ్యానికి ఆయన అక్షరాలా చక్రవర్తిగానే వ్యవహరించారు. నిజమే... ఆయన 1962లో సాధారణ ఉద్యోగిగా చేరిననాటికే దేశంలో అదొక అత్యున్నత శ్రేణి సంస్థ కావొచ్చుగాక. పైగా సంస్థ సారథులకు ఆయన అతి దగ్గరివాడు, బంధు వర్గంలో ఒకడు కూడా! కానీ ఆయన ఎదుగుదలకు తోడ్పడినవి అవి కాదు. ఆయన అంకితభావం, దీక్షాదక్షతలు, నిరంతర తపన ఆయనను అంచెలంచెలుగా పైపైకి చేర్చాయి. పేరుకు ఒక సంఘటిత సంస్థే అయినా, అప్పటికే లక్షలమంది సిబ్బందికి చల్లని నీడనిచ్చే కల్పవృక్షంగా పేరుతెచ్చుకున్నా... టాటాల సామ్రాజ్యం విభిన్న సంస్థల సమాహారం మాత్రమే! అందులో సమష్టితత్వం, దిశ, దశా నిర్దేశించే ఉమ్మడి తాత్విక భూమిక శూన్యం. జమ్‌షెడ్జీ టాటా, జేఆర్‌డీ టాటా వంటివారు నేతృత్వం వహించిన ఆ సంస్థలో నాయకత్వ స్థానం దక్కాలంటే అడుగడుగునా అవరోధాలు తప్పలేదు. నెత్తురు చిందకపోవచ్చు... గాయాల జాడ లేకపోవచ్చు, కానీ రోమన్ సామ్రాజ్యకాలం నాటి కలోసియంలను తలపించే బోర్డు రూంలో తన ఆలోచనలనూ, తన భావనలనూ బలంగా వినిపించి ప్రత్యర్థుల వాదనలను పూర్వపక్షం చేయటం మాటలు కాదు. తన ప్రతి పలుకూ, ప్రతి వివరణా నిశితంగా గమనించే, ప్రశ్నించే ఆ బోర్డు రూంలో గెలవటం సాధారణం కానే కాదు. కానీ రతన్ అవన్నీ అవలీలగా చేయగలిగారు. నిష్క్రమిస్తున్న చైర్మన్‌జేఆర్‌డీ టాటా ఆశీర్వాదం పుష్కలంగా ఉన్నా అప్పటికే భిన్న సంస్థలకు సారథులైనవారు సామాన్యులు కాదు. అప్పటికింకా టిస్కోగానే ఉన్న టాటా స్టీల్‌కు రూసీ మోదీ సారథి. పారిశ్రామిక రంగంలో ఆయన మోత మోగిస్తున్నాడు. జమ్‌షెడ్‌పూర్‌లో కొలువుదీరిన ఆ సంస్థకాయన మకుటంలేని మహారాజు. అజిత్ కేర్కర్ ఇండియన్ హోటల్స్‌లో తనదైన ముద్ర వేసుకున్నాడు. దర్బారీ సేల్ టాటా కెమికల్స్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. వీళ్లెవరూ రతన్ టాటాను సీరియస్‌గా తీసుకోలేదు. అతన్ని అవలీలగా అధిగమించవచ్చునుకున్నారు. రతన్ తన పేరులో చివరున్నరెండక్షరాల పుణ్యమా అని ఇంత దూరం వచ్చాడు తప్ప 'సరుకు' లేదనుకున్నారు. ఆయన రాకపై ఆలోచించటం సమయాన్ని వృథా చేసుకోవడమే అనుకున్నారు. కానీ రతన్ పరిశీలనాశక్తి అమోఘ మైనది, అనితర సాధ్యమైనది. ఈ మహాసామ్రాజ్యంలో ఏం జరుగుతున్నదో, లోపాలేమిటో అచిర కాలంలోనే పసిగట్టాడు. తళుకుబెళుకులకు తక్కువేం లేదు. మదుపుపరులకు ఎప్పటికప్పుడు లాభాల పంటా పండుతోంది. కానీ అట్టడుగున అవాంఛనీయమైన పోకడలు కనబడుతున్నాయి. వాటిని చక్కదిద్దితేసంస్థను మరిన్ని రెట్లు పెంచి ఘనతరమైనదిగా తీర్చిదిద్దటం అసాధ్యమేమీ కాదని ఆయన నిర్ణయించుకున్నాడు. 1991 నాటికే దేశంలో అడుగుపెట్టిన ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో పాత పద్ధతిలోనే టిస్కోను కొనసాగిస్తే త్వరలోనే అది గ్రూపు చేజారటం ఖాయమన్న నిర్ణయానికొచ్చాడు. జేఆర్‌డీ మంచితనమో, గమనించలేని తత్వమో గానీ... టాటా స్టీల్‌లో అప్పటికి టాటాలకున్న ప్రమోటర్ వాటా కేవలం అయిదు శాతం మాత్రమే. ఇదే కొనసాగితే ఏదోనాటికి అది ఎవరి చేతుల్లోకైనా పోవచ్చని రతన్ గ్రహించారు. అదొక్కటే కాదు... గ్రూపు సంస్థల్లో ఏ ఒక్కటీ చేజారకుండా ప్రమోటర్ వాటాను గణనీయంగా పెంచారు. సొంత సంస్థలను పదిలపరచుకోవటమే కాదు, ఖండాంతర ఆంగ్లో–డచ్ స్టీల్ సంస్థ కోరస్‌ను వశపరుచుకున్నారు. ఒకప్పుడు తనకు అవరోధంగా నిలిచిన అమెరికన్ దిగ్గజ సంస్థ ఫోర్డ్ నుంచి జాగ్వార్ ల్యాండ్‌రోవర్‌ను టాటాల తీరానికి చేర్చారు. వర్తమానంలో పారిశ్రామికవేత్తల ఎదుగుదల ఎలా సాధ్యమవుతున్నదో బాహాటంగానే కనబడుతోంది. కానీ రతన్ టాటా ఇందుకు భిన్నం. టాటా సంస్థలపై మచ్చపడకుండా, వక్రమార్గాల జోలికిపోకుండా నిదానంగా తన ప్రస్థానం సాగించారు. ఆయన పట్టిందల్లా బంగారమేనని చెప్పడానికి లేదు. కోరస్ టేకోవర్ అయినా, నానో కారు ఉత్పత్తి ఉబలాటమైనా, టాటా గ్రూప్ సంస్థల చైర్మన్‌గా సైరస్ మిస్త్రీ ఆగమన, నిష్క్రమణల్లో అయినా రతన్ వైఫల్యాలు స్పష్టంగా కనబడతాయి. అందుకాయన విమర్శలను ఎదుర్కొనక తప్పలేదు. అలాగే టాటా స్టీల్‌ను దాదాపు 1,200 కోట్ల డాలర్ల విలువైన సంస్థగా తీర్చిదిద్దినప్పుడూ, దేశీయ విద్యుత్ ఆధారిత వాహన రంగంలో టాటా మోటార్స్‌ను మార్కెట్ లీడర్‌గా ముందుకు ఉరికించినప్పుడూ ఆయన గర్వం తలకెక్కించుకోలేదు. ఇవాళ్టి రోజున బహుళజాతి సంస్థల సమాహారంగా ఖండాంతరాల్లో వెలుగు లీనుతున్న టాటా గ్రూప్ నిరుటి రెవెన్యూ 16,500 కోట్ల డాలర్లు. ఆయన వ్యక్తిగత ఆదాయమే కొన్ని వందల కోట్లు. అయినా చివరి వరకూ అతి సాధారణ జీవితం గడిపి, అసహాయులకు అండదండలందించి జీవితాన్ని ధన్యం చేసుకున్న రతన్‌కు కొందరు కోరుకుంటున్నట్టు 'భారతరత్న' ప్రకటిస్తే అది ఆ అత్యున్నత పురస్కారానికి మరింత వన్నె తెస్తుంది. ఆ మహామనీషికి 'సాక్షి' వినమ్రంగా నివాళులర్పిస్తున్నది.

# భూమిలో వింత చప్పుడు
# ప్రతి 26 సెకన్లకు ఓ ప్రకంపన..

ప్రతి 26 సెకన్లకు భూమిలో ఓ రహస్య ప్రకంపన నమోదు

1960లలో తొలిసారిగా గుర్తించిన శాస్త్రవేత్తలు

పశ్చిమ ఆఫ్రికాలోని గినియా సింధుశాఖ దీనికి కేంద్రంగా అనుమానం

సముద్రపు అలలు లేదా అగ్నిపర్వతాల చర్యలే కారణమని భావన

"భూమి గుండెచప్పుడు"గా పిలుస్తున్న ఈ ప్రకంపనపై కొనసాగుతున్న పరిశోధనలు

ఇప్పటికీ వీడని మిస్టరీగా మిగిలిపోయిన భూమి స్పందన

## అంతుచిక్కని మిస్టరీ!



మన భూమి అంతర్భాగంలో ఓ వింత ప్రకంపన శాస్త్రవేత్తలను దశాబ్దాలుగా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇది ఎంత బలహీనంగా ఉంటుందంటే, మానవులకు దీని ప్రభావం తెలియదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత సున్నితమైన భూకంపాలను నమోదు చేసే సీస్మోమీటర్లు (భూకంపమాపకాలు) మాత్రం ప్రతి 26 సెకన్లకు ఒకసారి క్రమం తప్పకుండా ఈ సూక్ష్మ ప్రకంపనను రికార్డు చేస్తున్నాయి. శాస్త్రవేత్తలు దీన్ని సరదాగా "భూమి గుండెచప్పుడు" అని పిలుస్తున్నారు. ఈ వింత శబ్దాలను మొదటిసారిగా 1960వ దశకంలో భూభౌతిక శాస్త్రవేత్త జాక్ ఆలివర్ గుర్తించారు. అప్పట్లో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో, ఈ ప్రకంపనలకు మూలం హిందూ మహాసముద్రంలోని అట్లాంటిక్ ప్రాంతంలో ఉందని ఆయన అంచనా వేశారు. కొన్ని ప్రత్యేక సమయాల్లో ఈ ప్రకంపనల తీవ్రత పెరుగుతుందని కూడా ఆయన కనుగొన్నారు. ఆ తర్వాత చాలా సంవత్సరాలకు, అంటే 2005లో కొలరాడో విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుడు మైక్ రిట్జ్‌వోలర్ నేతృత్వంలోని బృందం మరింత ఆధునిక పరికరాలను ఉపయోగించి ఈ ప్రకంపనలను ధ్రువీకరించింది. దీని మూలం పశ్చిమ ఆఫ్రికా తీరంలోని గినియా సింధుశాఖ ప్రాంతంలో, ప్రత్యేకించి బైట్ ఆఫ్ బోనీ వద్ద ఉందని వారు స్పష్టం చేశారు. "మేము ఏదో వింతైన, స్థిరమైన, నిరంతరమైన ప్రక్రియను గమనించాం" అని రిట్జ్‌వోలర్ ఆ సమయంలో తెలిపారు. సాధారణ భూకంపాల మాదిరిగా కాకుండా, ఇది చాలా క్రమబద్ధంగా ఉండటం శాస్త్రవేత్తలను అమితంగా ఆకర్షించింది. ఈ 26 సెకన్ల విరామంతో వచ్చే స్పందనకు కచ్చితమైన కారణం ఏమిటనేది ఇప్పటికీ పూర్తిస్థాయిలో తెలియరాలేదు. అయినప్పటికీ, శాస్త్రవేత్తలు కొన్ని ప్రధాన సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

సముద్రపు అలల ప్రభావం:

బలమైన సముద్రపు అలలు తీరప్రాంతాలను లేదా సముద్ర గర్భాన్ని ఢీకొట్టినప్పుడు, అవి భూమి పొరలలో ఒత్తిడి తరంగాలను సృష్టిస్తాయని భావిస్తున్నారు. ఈ సూక్ష్మ ప్రకంపనలే ఈ 26 సెకన్ల లయకు కారణం కావచ్చునేది ప్రధాన పరికల్పన. గినియా సింధుశాఖలో సముద్రపు అలలు సముద్రగర్భంతో చర్య జరపడం వల్లే ఈ సంకేతం ఉత్పత్తి అవుతుండవచ్చని చాలామంది శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు.

అగ్నిపర్వతాల చర్యలు:

సముద్రగర్భంలోని అగ్నిపర్వతాల కార్యకలాపాలు లేదా భూమి యొక్క టెక్టోనిక్ ప్లేట్ల కదలికలు కూడా ఈ ఆవర్తన శక్తి విడుదలకు కారణం కావచ్చునేది మరో సిద్ధాంతం. 2013లో చైనాకు చెందిన కొందరు పరిశోధకులు, గినియా సింధుశాఖలోని సావో టోమే అనే అగ్నిపర్వత ద్వీపం ఈ ప్రకంపనలకు కేంద్రంగా ఉండవచ్చని సూచించారు. ఈ "భూమి గుండెచప్పుడు" కేవలం శాస్త్రవేత్తల కుతూహలాన్ని రేకెత్తించే అంశం మాత్రమే కాదు. మన గ్రహం యొక్క సంక్లిష్టమైన అంతర్గత వ్యవస్థలను అర్థం చేసుకోవడానికి ఇది ఒక ముఖ్యమైన మార్గంగా ఉపయోగపడుతుంది. ఈ సూక్ష్మ ప్రకంపనలను అధ్యయనం చేయడం ద్వారా సముద్రాలు, టెక్టోనిక్ ప్లేట్లు, భూమి అంతర్భాగాలు ఎలా పరస్పరం చర్య జరుపుకుంటాయో శాస్త్రవేత్తలు మరింత లోతుగా తెలుసుకోవచ్చు. భవిష్యత్తులో భూకంపాలను గుర్తించడం, వాటిని అంచనా వేయడంలో కూడా ఇది కొంతవరకు సహాయపడగలదని ఆశిస్తున్నారు. అయితే, దశాబ్దాలుగా పరిశోధనలు సాగుతున్నప్పటికీ, ఈ 26 సెకన్ల విరామంతో వచ్చే స్పందన వెనుక ఉన్న అసలు కారణం ఇప్పటికీ ఒక రహస్యంగానే మిగిలిపోయింది. సాంకేతిక పరిజ్ఞానం మరింత అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, భవిష్యత్ పరిశోధనలు ఈ నిగూఢమైన "భూమి గుండెచప్పుడు" వెనుక ఉన్న మిస్టరీని ఛేదిస్తాయని శాస్త్రవేత్తలు దృఢమైన ఆశాభావంతో ఉన్నారు.

# శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర నేడు.. ఆల్ ది బెస్ట్ చెప్పిన ఐఏఎఫ్

యాక్సియమ్-4 మిషన్ ద్వారా అంతరిక్షంలోకి భారత వ్యోమగామి శుభాంశు శుక్లా

వాతావరణం అనుకూలించకపోవడంతో ప్రయోగం జూన్ 11 సాయంత్రానికి వాయిదా

రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్తున్న రెండో భారతీయుడు ఈయనే

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టనున్న తొలి భారతీయుడిగా చరిత్ర

ఈ యాత్రలో దాదాపు 14 రోజులు ఐఎస్ఎస్‌లో 60 శాస్త్రీయ పరిశోధనలు

భారత్, పోలాండ్, హంగేరీ దేశాలకు ఇది కీలకమైన అంతరిక్ష యాత్ర



ఢిల్లీ: భారత అంతరిక్ష చరిత్రలో మరో సువర్ణాధ్యాయం లిఖించబడనుంది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లా చారిత్రాత్మక యాక్సియమ్-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఈ ప్రయోగానికి భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసింది. వాస్తవానికి ఈ వారం ప్రారంభంలో జరగాల్సిన ఈ ప్రయోగం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రేపటికి వాయిదా పడింది. రేపు భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5:30 గంటలకు (అమెరికా కాలమానం ఉదయం 8:00) యాత్ర ప్రారంభం అవుతుంది. యాక్సియమ్-4 మిషన్‌లో శుభాంశు శుక్లా పైలట్‌గా వ్యవహరించనున్నారు. 1984లో రాకేశ్ శర్మ చారిత్రాత్మక అంతరిక్ష యాత్ర తర్వాత అంతరిక్షంలోకి వెళ్తున్న రెండవ భారతీయుడిగా శుక్లా నిలవనున్నారు. అంతేకాకుండా 25 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టనున్న తొలి భారతీయుడిగా కూడా ఆయన రికార్డు సృష్టించనున్నారు. ఈ మిషన్‌కు అమెరికాకు చెందిన అనుభవజ్ఞురాలైన వ్యోమగామి పెగ్గీ విట్సన్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఇది ఆమెకు ఐదో ఐఎస్ఎస్ యాత్ర కావడం విశేషం. వీరితో పాటు పోలాండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కి-విస్నీవ్‌స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కాపు మిషన్ స్పెషలిస్టులుగా తొలిసారి అంతరిక్షంలోకి పయనిస్తున్నారు. భారతదేశం (1984), పోలాండ్ (1978), హంగేరీ (1980) దేశాలు గతంలో ఒక్కొక్క వ్యోమగామిని మాత్రమే అంతరిక్షంలోకి పంపాయి. ఇప్పుడు ఈ మూడు దేశాలు మళ్లీ మానవసహిత అంతరిక్ష యాత్రలు చేపడుతుండటంతో ఈ మిషన్‌కు "రియలైజ్ ది రిటర్న్" (తిరిగి సాధించు) అనే నినాదాన్ని ఇచ్చారు. శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర ప్రస్థానం 2019లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నుంచి వచ్చిన పిలుపుతో మొదలైంది. ఆ తర్వాత ఆయన మాస్కోలోని స్టార్ సిటీలో ఉన్న యూరి గగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లో కఠినమైన శిక్షణ పొందారు. 2025లో ప్రయోగించతలపెట్టిన భారతదేశపు తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర "గగన్‌యాన్" కోసం శిక్షణ పొందుతున్న వ్యోమగాములలో శుక్లా ఒకరని భారత ప్రధాని నరేంద్ర మోదీ 2024 ఫిబ్రవరిలో ప్రకటించారు. యాక్సియమ్-4 బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సుమారు 14 రోజుల పాటు ఉంటుంది. ఈ సమయంలో వారు 31 దేశాలకు చెందిన దాదాపు 60 శాస్త్రీయ అధ్యయనాలను నిర్వహించనున్నారు. ఇప్పటివరకు జరిగిన యాక్సియమ్ మిషన్లలో ఇదే అత్యంత ఎక్కువ పరిశోధనలు చేసే మిషన్ కానుంది. ఈ అధ్యయనాలు మానవ ఆరోగ్యం, అంతరిక్ష వాణిజ్యీకరణ, ఇతర కీలక రంగాలకు తోడ్పడతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. యాక్సియమ్-4 బృందం రాక కోసం ఐఎస్ఎస్‌లోని ఎక్స్‌పెడిషన్ 73 సిబ్బంది ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. స్టేషన్ వ్యవస్థలను సిద్ధం చేయడం, టాబ్లెట్ కంప్యూటర్లను యాక్టివేట్ చేయడం, సందర్శక సిబ్బంది కోసం స్లీప్ స్టేషన్లను ఏర్పాటు చేయడం వంటి పనులను పూర్తి చేస్తున్నారు. ప్రయోగం విజయవంతమైతే, జూన్ 12వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు స్పేస్‌ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానం (డాకింగ్) అవుతుందని అంచనా. ఈ ప్రక్రియను నాసా ఫ్లైట్ ఇంజనీర్లు ఆన్ మెక్‌క్లెయిన్, నికోల్ అయర్స్ పర్యవేక్షిస్తారు.

# ఏపీలో పలు జిల్లాల్లో భానుడి భగభగలు

15 జిల్లాల్లో 41-42.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదుకు అవకాశం

బుధవారం కూడా రాష్ట్రంలో 40-41 డిగ్రీల వరకు ఎండల తీవ్రత

నేడు నాలుగుచోట్ల 40.9 డిగ్రీలుగా నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రత

అల్లూరి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్షాలు కురిసే సూచన

## ఏపీలో ఎండలు మండిపోతాయట!



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం విభిన్నంగా కొనసాగుతోంది. ఒకవైపు పలు జిల్లాలు తీవ్రమైన ఎండలతో మండిపోతుండగా, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

### (జూన్ 10) పలు జిల్లాల్లో తీవ్ర ఉక్కపోత

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, మంగళవారం రాష్ట్రంలోని విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో తీవ్రమైన ఉక్కపోత వాతావరణం నెలకొంటుంది. ఈ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుండి 42.5 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

### బుధవారం (జూన్ 11) కూడా కొనసాగనున్న ఎండలు

ఇక బుధవారం కూడా ఎండల తీవ్రత తగ్గకపోవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆ రోజు కూడా పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుండి 41 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

నేడు పలుచోట్ల 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

ఇదిలా ఉండగా, సోమవారం (జూన్ 9) రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట, మన్యం జిల్లా గంగన్నదొరవలస, కృష్ణా జిల్లా పెనుమల్లి, ప్రకాశం జిల్లా మాలెపాడులో 40.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

కొన్ని జిల్లాల్లో వర్షాలకు అవకాశం

మరోవైపు, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలకు వర్ష సూచన కొంత ఉపశమనం కలిగించేలా ఉంది. అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రదేశాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ వర్షాల వల్ల ఆయా ప్రాంతాల్లో ఉక్కపోత నుంచి ప్రజలకు కొంత ఊరట లభించే వీలుంది. మొత్తం మీద రాష్ట్రంలో కొన్నిచోట్ల ఎండల తీవ్రత, మరికొన్ని చోట్ల వర్షాలతో మిశ్రమ వాతావరణం కొనసాగుతోంది.

# యాపిల్ ఎక్స్‌కోడ్‌కు చాట్‌జీపీటీ అనుసంధానం..!




యాపిల్ డబ్ల్యూడబ్ల్యూడీసీ 2025 (వరల్డ్ వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్)లో పలు ఆసక్తికర మార్పులను ప్రకటించింది. దాని ప్రధాన యాప్ బిల్డింగ్ టూల్ ఎక్స్‌కోడ్‌కు చాట్ జీపీటీని అనుసంధానిస్తున్నట్లు వెల్లడించింది. ఫలితంగా కృత్రిమ మేధ సాయంతో కోడ్ రాయడం, బగ్స్‌ను సరిచేయడం, డాక్యుమెంటేషన్, యాప్స్ టెస్టింగ్ వంటివి చేసే అవకాశం లభిస్తుందని పేర్కొంది. ఎక్స్‌కోడ్ 26 అనే సరికొత్త వెర్షన్ తీసుకొచ్చింది. దీనిలో డెవలపర్లు ఇతర ఏఐ మోడల్స్‌ను కూడా ఏపీఐ 'కీ'లను వాడి ప్లగ్ఇన్ చేసుకొనే అవకాశం కల్పించింది. ఇప్పటికే యాపిల్ చిప్స్‌ను వాడుతున్నవారు ఇంటర్నెట్‌పై ఆధారపడకుండా ఏఐ మోడల్స్‌ను ఎటువంటి సమస్య లేకుండా రన్ చేసుకోవచ్చు. తమ పరికరాల యూజర్లు కేవలం మూడు లైన్ల కోడ్‌తో.. యాపిల్ ఏఐ టూల్స్ వాడుకొనేలా ఫౌండేషన్ మోడల్స్ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రారంభించింది. ఎక్స్‌కోడ్‌లో చాట్‌జీపీటీని వినియోగించాలంటే ఓపెన్ ఏఐ ఖాతాలోకి సైన్ఇన్ కావాల్సిన అవసరం లేదు. దీంతోపాటు ఎక్స్‌కోడ్‌లో సరికొత్త నేవిగేషన్ సిస్టమ్, మరింత మెరుగైన సపోర్ట్‌తో ట్రాన్స్‌లేటింగ్ యాప్స్, వాయిస్ కంట్రోల్ పనితీరును మెరుగుపర్చింది.

లిక్విడ్ గ్లాస్ పరిచయం..


ఈ కాన్ఫరెన్స్‌లో యాపిల్ తన ఐఫోన్, మ్యాక్, వాచ్‌ల కోసం సరికొత్త లిక్విడ్ గ్లాస్ డిజైన్‌ను పరిచయం చేసింది. తమ ఉత్పత్తులన్నీ ఒకేరకమైన అనుభవం ఇచ్చేందుకు అన్నింట్లో ఒకేసారి డిజైన్ అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొంది. దీంతో ఐవోఎస్, ఐపాడ్ వోఎస్, మ్యాక్ వోఎస్, వాచ్ వోఎస్ ఒకేసారి ఈ మార్పు రానుంది. చివరిసారిగా యాపిల్ డిజైన్ ఐవోఎస్7 సమయంలో జరిగింది. "నేడు మా విస్తృతమైన డిజైన్ అప్‌డేట్‌ను ప్రకటించడానికి చాలా ఉత్సుకతతో ఉన్నాను. అది పూర్తిగా సరికొత్తగా ఉంటుంది. దానికి మేము లిక్విడ్‌గ్లాస్ అని పేరుపెట్టాము. దానికి గాజు, ద్రవాల వంటి పారదర్శకతను యాపిల్ సాధించింది. అది మీ కంటెంట్‌ను బట్టి మారుతుంది. మరింత వినియోగానికి అవసరమైన స్పష్టత, కంట్రోల్స్‌ను అందిస్తుంది" అని యాపిల్ డిజైన్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అలాన్ డై పేర్కొన్నారు.




# జోలపాటే మేలట!



'అమ్మపాడే జోలపాట... అమృతానికన్న తీయనంట...', 'వటపత్ర శాయికి వరహాల లాలి... రాజీవ నేత్రునికి రతనాల లాలి...' అంటూ జోలపాట గొప్పదనాన్ని తెలిపే పాటలు ఎన్నో. కానీ, ఇప్పుడు నిజంగా పాటపాడి బుజ్జాయిలను నిద్రపుచ్చే వాళ్లెందరు? అయితే, కొత్త పద్ధతులు ఎన్ని వచ్చినా జోలపాటకు మించింది లేదంటున్నాయి తాజా యేల్ యూనివర్సిటీ అధ్యయనాలు. శిశువుల మానసిక స్థితిని మెరుగుపరిచే వాటిల్లో ఇదే అత్యంత సురక్షితమైన, తేలికైన పద్ధతనీ చెబుతున్నాయి. పాట పాడి నిద్రపుచ్చడం వల్ల శిశువులతోపాటు, అమ్మానాన్నలు, మిగతా కుటుంబ సభ్యుల జీవన నాణ్యత కూడా మెరుగుపడుతుందట. ఈ పరిశోధన కోసం శాస్త్రవేత్తలు కొందరు తల్లిదండ్రులనీ, 4నెలల కంటే తక్కువ వయసున్న శిశువుల్నీ ఎంచుకున్నారు. వాళ్లని రెండు గ్రూపులుగా విభజించి... ఒక గ్రూప్ వాళ్లను శిశువులకు రోజూ పాట పాడి వినిపించమన్నారు. ఇంకొకరిని మామూలుగా ఉండమన్నారు. ఇలా నాలుగు వారాలపాటూ చేశాక... శిశువుల మూడ్, చిరాకు స్థాయులు, సంగీతానికి ఎలా స్పందిస్తున్నారన్న విషయాలన్నీ సర్వే చేశారు. అందులో సగానికి పైగా తల్లిదండ్రులు వారి శిశువుల మానసిక స్థితి మెరుగుపడినట్లు తెలిపారట. కాబట్టి, ఖరీదుతో కూడిన, క్లిష్టమైన పద్ధతులకంటే 'లాలిపాట' మేలని సూచిస్తున్నారు పరిశోధకులు. మరి మీ బుజ్జాయిని నిద్రపుచ్చడానికి మీరు ఎలాంటి పద్ధతులు పాటిస్తున్నారు?



### మీకు తెలుసా?

శిశువుల చర్మం మీద గులాబీ, ఎరుపు రంగుల్లో పుట్టుమచ్చలు ఏర్పడటం చూస్తుంటాం కదా! ఇవి రక్తనాళాల సమూహాలు విస్తరించడం వల్ల ఏర్పడతాయి. వీటినే 'ఏంజెల్ కిసెస్' అంటారట. సాధారణంగా కనురెప్పలు, ముఖం, నుదురు, పెదవిపై కనిపించే ఈ గుర్తులు కాలక్రమేణా మసకబారతాయట.

# రిచ్ మరింత 'రిచ్'.. పూర్ మరింత 'పూర్'

## అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ త్వరలో ముందడుగు

### జపాన్‌ను వెనక్కి నెట్టి నాలుగో స్థానానికి చేరే అవకాశం

ప్రపంచంలోనే యూఎస్, చైనా, జర్మనీ, జపాన్ తర్వాత ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ దూసుకుపోతోంది. త్వరలో జపాన్‌ను సైతం వెనక్కి నెట్టి నాలుగో స్థానానికి చేరుకుంటోందనే అంచనాలు వెలువడుతున్నాయి. కానీ ప్రజల ఆదాయాలు, వారి సంపద మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. గతంలో ఇటీవల హురున్ ఇండియా దేశంలోని అత్యంత సంపన్నుల జాబితాను విడుదల చేసింది. రూ.1,000 కోట్ల సంపద కలిగిన వారిని పరిగణనలోకి తీసుకుని దీన్ని రూపొందించారు. దాని ప్రకారం దేశంలోని కుబేరుల సంఖ్య ఏడికేడు పెరుగుతోంది. మొత్తం దేశంలో అత్యధిక సంపన్నుల సంఖ్య 1,539కు పైగానే ఉంది. వీరి వద్ద రూ.159 లక్షల కోట్ల కంటే ఎక్కువే సంపద మూలుగుతుంది. ఏడాది ప్రాతిపదికన వీరి ఆస్తులు 46 శాతం వృద్ధి చెందుతున్నాయి. ఇలా కొద్ది మంది వద్దే రూ.లక్షల కోట్లు పోగవ్వడం సామాజిక అంశాతికి దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

చాలా మంది




ఇంటిముందు మురికికాలువ పారుతుంటే టెక్నికల్‌గా ప్రపంచంలోనే టాప్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ దూసుకుపోతుందని చంకలు చరుచుకోవడం సరికాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు బ్రిటిష్ కాలంలో కంటే ఇప్పుడు ఎక్కువయ్యాయి. కొన్ని నివేదికల ప్రకారం దేశంలోని ఒక శాతం జనాభా చేతుల్లోకి 40.1 శాతం సంపద మూలుగుతోంది. వివిధ వర్గాల ఆదాయ సంపదల్లో అసమానతలు ఉన్నప్పటికీ, అందరి వాస్తవ ఆదాయాలు క్రమంగా పెరుగుతున్నాయి. అయితే ప్రజల ఆదాయాలతో పాటే వాటి మధ్య అంతరాలు అధికమవుతున్నాయి. అందుకు 1991లో చేపట్టిన ఆర్థిక సంస్కరణలే కారణమని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వీటిని అమలు చేయకముందు వరకు దేశ జీడీపీ మూడు శాతం వద్దే ఆగిపోయింది. ఈ సంస్కరణల తర్వాత జీడీపీ 6-8 శాతం పెరిగింది. అయినా గరిష్ఠ సంపద తక్కువ మంది చేతుల్లోకే వెళుతుంది.

సామాజిక అశాంతి నెలకొనే ప్రమాదం

భారత్‌తోపాటు అనేక దేశాల్లో ఈ ఆర్థిక అసమానతలకు సంబంధించిన సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఇవి మరింత పెరిగితే సామాజిక అశాంతి నెలకుంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఈ అంతరాలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అత్యంత ధనవంతులపై విధించే పన్నులు పెంచాలని చెబుతున్నారు. కుబేరులకు వారసత్వంగా వచ్చే సంపదపై పన్ను విధించాలంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు.. ఇందుకు సహకరించాలని కోరుతున్నారు. దురదృష్టవశాత్తు పార్టీలకు అతీతంగా ప్రభుత్వాలను పరోక్షంగా నడిపించేది ధనవంతులే. దాంతో చట్ట సభల్లో ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ధైర్యం చేయడానికి ప్రజా ప్రతినిధులు సహకరించడం లేదు. కానీ ఆర్థిక అసమానతల వల్ల భవిష్యత్తులో రాబోయే సామాజిక అశాంతిని దృష్టిలో ఉంచుకుని ఈమేరకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఏం చేయాలంటే..

భారతదేశం 2027 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్షిస్తుంది. అయితే ఇలా కుబేరుల సంఖ్య పెంచుకుంటూ, వారి సంపదను లెక్కల్లో చూపుతూ ఈ ఘనత సాధించడంలో అర్థం లేదు. సామాజిక శైలి, సమగ్ర జీవన ప్రమాణాల్లో మార్పు వస్తూ సంపద సృష్టించగలిగితేనే మేలు జరుగుతుంది. ఈమేరకు విధానాలను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది. అటువంటి ప్రయత్నాలు చేయకపోతే కొందరి చేతిల్లోనే సంపద చేరి దేశంలో సామాజిక అశాంతి పెరిగే ప్రమాదం ఉంది.




# బ్లాక్ హెడ్స్‌కు చెక్, ముఖాన్ని మెరిపించే స్క్రబ్స్

ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ బ్లాక్ హెడ్స్ వస్తూనే ఉంటాయి. వీటివల్ల ముఖం కళావిహీనంగా కనిపిస్తుంది. వీటిని తీయించుకోవడం ఖర్చుతో కూడుకున్నదేగాక, సమయం కూడా వెచ్చించాలి. అయితే ఇంట్లో ఉండే దాల్చినచెక్క, నిమ్మ, పప్పు, పాలు, పంచదార, కొబ్బరి నూనె, ఉప్పుతో సులభంగా తొలగించుకోవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు.

అవేంటో చూద్దాం... చర్మంలో అతిముఖ్యమైన ప్రొటీన్ కొల్లాజెన్ విడుదలను మెరుగుపరచడంలో దాల్చినచెక్క ప్రముఖ పాత్ర పోషిస్తుంది. చర్మం మీద ఏర్పడే రంధ్రాలను దాల్చిని తగ్గిస్తుంది. నిమ్మరసంలోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మంమీద రంధ్రాలను లోతుగా శుభ్రం చేస్తాయి. అందువల్ల అరచెక్క నిమ్మరసంలో టీస్పూను దాల్చిన చెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రాంతంలో పూతలా వేసి పదిహేను నిమిషాల పాటు మర్దనా చేయాలి. తరువాత చల్లటి నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే బ్లాక్‌హెడ్స్ తగ్గుముఖం పడతాయి. స్పూను పంచదారలో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెవేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఇరవై నిమిషాలపాటు మర్దన చేసి తరువాత కడిగేయాలి. పంచదార చర్మాన్ని లోతుగా శుభ్రంచేసి మూసుకు పోయిన రంధ్రాలను తెరవడంతో పాటు, మృతకణాలను తొలగిస్తుంది. కొబ్బరి నూనెలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు, మృదువుగా మారుస్తాయి. అరచెక్క నిమ్మరసంలో అరటీస్పూను సాల్ట్‌వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పదినిమిషాల?టు మర్దన చేసి చల్లని నీటితో కడిగేయాలి. ఈ స్క్రబ్ వదులుగా ఉన్న చర్మాన్ని బిగుతుగా మార్చడంతోపాటు, బ్లాక్‌హెడ్స్‌ను తొలగించి చర్మం కాంతిమంతం గా మెరిసేలా చేస్తుంది.

డార్క్ సర్కిల్స్

టీ స్పూన్ టొమాటో గుజ్జు, సెనగపిండి, చిటికెడు పసుపు, అర టీస్పూన్ నిమ్మరసం కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి, కళ్ల మీద గుండ్రంగా తరిగిన కీరా ముక్కలు ఉంచి ఇరవై నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. తర్వాత ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తుంటే కళ్ల కింద నల్లని వలయాలు తగ్గుముఖం పట్టి, ముఖం కాంతిమంతం అవుతుంది.


నోట్: ఆరోగ్యాన్ని మించిన అందంలేదు. సమతులం ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, సరిపడినన్ని నీళ్లు తాగడం, చక్కటి నిద్ర, ఒత్తిడి లేని జీవితం, నలుగురితో హాయిగా, సంతోషంగా నవ్వుతూ గడిపే జీవన శైలి,ఏదైనా అనారోగ్యసమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం ఇవి చాలు ఆరోగ్యంగా ఆనందంగా జీవించడానికి.

# రోగ నిర్ధారణతో బ్రెయిన్ ట్యూమర్ ఆటకట్టు

### వ్యాధి నియంత్రణలో నిర్ధారణ, చికిత్సలే కీలకం

### ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం సందర్భంగా ఆలీవ్ హాస్పిటల్ అవగాహన సదస్సు

హైదరాబాద్: ప్రాణాంతకమైన బ్రెయిన్ ట్యూమర్ (మెదడులో కణతులు) వ్యాధి ఆట కట్టించాలంటే సరైన నిర్ధారణ, చికిత్సలే కీలకమని హైదరాబాదులోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆలివ్ హాస్పిటల్ న్యూరాలజీ నిపుణులు పేర్కొన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై పౌరులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాన్నినిర్వహించారు. ఆరోగ్య సంరక్షణలో విశ్వసనీయత, మెరుగైన ఆరోగ్య ఫలితాలను సాధిస్తూ, రోగుల ప్రాణాలను కాపాడటానికి అంకితభావంతో వైద్య సేవలు అందించేందుకు ఆలివ్ హాస్పిటల్ కృషి చేస్తోంది. జీవితాన్నితల కిందులు చేసే బ్రెయిన్ ట్యూమర్ల వ్యాధిపైప్రజలలో అవగాహన పెంచడం, ముందస్తుజాగ్రత్తలతో పలు సూచనలు చేస్తున్నారు. క్యాన్సర్, క్యాన్సర్ కాని మెదడు కణితులు ఏటా వేలాది మంది భారతీయులను ప్రభావితం చేస్తున్నాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డేటా ప్రకారం, దేశంలో ప్రతి ఏడాది 40,000 కంటే ఎక్కువ మందిలో కొత్తగా మెదడు కణితులు గుర్తించబడుతున్నాయి. తరచూ తలనొప్పి, దృష్టిలోపాలు, జ్ఞాపకశక్తికోల్పోవడం వంటి నిర్దిష్ట లక్షణాల ఫలితంగా అనేక ఇతర కణితులు గుర్తించబడకుండా పోతున్నాయని నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా "ఆలివ్ హాస్పిటల్ గత ఏడాదిలోనే బ్రెయిన్ ట్యూమర్ కన్సల్టేషన్లలో 20% పెరుగుదలను నమోదు చేసిందనీ గుర్తుచేశారు. ఆసుపత్రిలోని న్యూరాలజీ, న్యూరోసర్జరీ యూనిట్లు అధునాతన %వీ=×% డయాగ్నస్టిక్స్, స్టీరియోటాక్టిక్ సర్జికల్ పరికరాలు, న్యూరాలజీ , పాలియేటివ్ కేర్, పునరావాస మద్దతుతో కూడిన మల్టీడిసిప్లినరీ కేర్ మోడల్ తో పూర్తిగా అధునాతన పరిజ్ఞానంతో వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంది. 'మెదడు కణితులు మోసపూరితమైనవిబీ లక్షణాలు ఎప్పుడూ బయటపడవు. అప్పుడప్పుడు ఇది నిరంతర తలనొప్పిలేదా ప్రవర్తనలో వివరించలేని మార్పువంటి సాధారణమైన దానితో ప్రారంభమవుతుంది. తమ శరీరాలపైశ్రద్ధ వహించాలని, ముందుగానే తమను తాము తనిఖీ చేసుకునేలా ఆలీవ్ హాస్పిటల్ ప్రోత్సహిస్తోంది. రోగాన్నిగుర్తించడం వల్ల సంరక్షణ నాణ్యత పెరుగుతుందనీ, రోగి యొక్క జీవన నాణ్యత పెరుగుతోంది. వ్యాధిని నయం చేయడంతో పాటుగా, రోగులు, వారి కుటుంబాలకు చికిత్స, ఆరోగ్య సంరక్షణ ప్రయాణంలో ప్రతి అడుగులో తోడుగా ఉంటుంది అని ఆలివ్ హాస్పిటల్ లోని సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ మొహమ్మద్ మహమూద్ అలీ అన్నారు. క్లినికల్ సూక్ష్మ నైపుణ్యాలతోపాటుగా, రోగి, వారి కుటుంబాలకు భావోద్వేగ, మానసిక భారాన్నికూడా పెంచుతుందని అర్థం చేసుకోవాలి. ఆలివ్ హాస్పిటల్ సకాలంలో నాడీ మూల్యాంకన చేసి వ్యాధిని కచ్చితత్వంతో గుర్తిస్తుంది. మెదడు కణితుల ప్రారంభ దశను కొన్నిసూచనల ద్వారా గుర్తించే వీలు ఉందని, దీంతో అధిక ప్రమాదకరమైన పరిస్థితుల నుంచి బయటపడే వీలుంటుందని వైద్యులు పేర్కొన్నారు. జూన్ 8న నిర్వహించే ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డే సంధ్భరంగా వ్యాధిపైఉన్న అపోహలను తొలగించడానికి, న్యూరో హెల్త్ పై అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నట్లుగా అలీ హాస్పిటల్ న్యూరో విభాగం వైద్యులు వివరించారు.



### ఆలివ్ హాస్పిటల్ గురించి:

ఆరోగ్య సంరక్షణకు భరోసానిస్తూతెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఆలివ్ హాస్పిటల్స్కృషి చేస్తుంది. ఆధునాతన వైద్య సదుపాయాలు, నాణ్యత, నిబద్ధతతో కూడిన సమగ్ర ఆరోగ్య సంరక్షణయే లక్ష్యంగా 2010 నుంచి వైద్య సేవలు అందిస్తోంది. మానవాళికి ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడం కోసం సాధారణ వైద్య సంస్థగా మొదలుపెట్టి.. ఆనాటి కాలంలోనే రోగి సంరక్షణలో అత్యుత్తమ ప్రతిభతో ఆలివ్ హాస్పిటల్ తెలంగాణలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులలో ఒకటిగా నిలిచింది. 210 పడకలతో, అత్యాధునిక మల్టీస్పెషాలిటీ హెల్త్కేర్ సౌకర్యం వివిధ స్పెషాలిటీలలో విస్తృత శ్రేణి వైద్య సేవలను అందిస్తుంది. కార్డియాక్ కేర్, ఎమర్జెన్సీసర్వీసెస్, న్యూరో కేర్, కిడ్నీకేర్, యూరాలజీ, ఆర్థోపెడిక్స్, జాయింట్ రీప్లేస్ మెంట్స్, గైనకాలజికల్ సర్వీసెస్, అడ్వాన్స్డ్ డయాగ్నస్టిక్స్, ఇంటర్వెన్షనల్ సర్వీసెస్ వంటి రంగాలలో అనేక అధునాతన విధానాలలో మార్గదర్శకత్వం వహించింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్నిఉపయోగించి, సమర్థులైన వైద్యులతో వైద్యం అందించడానికి కట్టుబడి ఉంది. దేశంలో ఆరోగ్య సంరక్షణ నాణ్యత ప్రమాణాలను కలిగి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ఫర్ హాస్పిటల్స్%-% హెల్త్కేర్ నుండి జాతీయ స్థాయిలో గుర్తింపును కలిగి ఉంది.



నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com
గురువారం - 12 - జూన్ - 2025

# ధోని అంటే కూల్ అండ్ కామ్!






ఇంటర్నెట్ డెస్క్: టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనికి ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు మాజీ క్రికెటర్లు ధోని గురించి మాట్లాడారు.

అతడో అద్భుతం

'ఎంఎస్ ధోని ఓ అద్భుతమైన ఆటగాడు. భారత్‌కు వరల్డ్ కప్‌ను అందించిన గొప్ప క్రికెటర్. తన జట్టులోని ఆటగాళ్ల బలాలేంటో ఓ కెప్టెన్‌గా అతడికి తెలుసు. అందుకే వాటిని జట్టు కోసం పూర్తిస్థాయిలో ఉపయోగించాడు. భారత్.. వరల్డ్ కప్ గెలుచుకునేలా కృషి చేశాడు. ఐపీఎల్‌లోనూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జట్టును అయిదుసార్లు టైటిల్ విజేతగా నిలిపాడు.' అని దినేశ్ కార్తిక్ అన్నాడు.

వేగానికి పెట్టింది పేరు

'ఎంఎస్ ధోని వేగానికి పెట్టింది పేరు. కళ్లు మూసి తెరిచేంతలో చాలా స్పీడ్‌గా స్టంపింగ్ చేయడంలో దిట్ట. అలాగే క్రికెట్‌లో సాధారణంగా కెప్టెన్లు తీవ్రమైన ఒత్తిడిలో ఉంటారు. కానీ ధోని ఎప్పుడూ ఒత్తిడిలో కనిపించలేదు. మైదానంలో కూల్ అండ్ కామ్‌గా ఉండేవాడు. సారథిగా సరైన నిర్ణయాలు తీసుకునేవాడు' అని నాసిర్ హుస్సేన్ కొనియాడాడు.

### హెలికాప్టర్ షాట్లతో..

'ఎంఎస్ ధోని హెలికాప్టర్ షాట్లతో పరుగులు రాబట్టాడు. జట్టుకు అవసరమైన సమయంలో అద్భుతంగా రాణించేవాడు' అని రికీపాంటింగ్ అన్నాడు.

### నాకు చాలా గౌరవం..

'ఎంఎస్ ధోని అంటే నాకు ఎంతో గౌరవం. చాలా ఏళ్లు అతడు క్రికెట్‌కు సేవలందించాడు. జట్టును ఎన్నోసార్లు గెలిపించాడు. అతడు ఆడిన విధానం అద్భుతం' అని ఏబీ డివిలియర్స్ అభిప్రాయం వ్యక్తంచేశాడు.




## పవన్ వెర్సన్ బాలయ్య..
# తగ్గేదెవరు?

మెగా, నందమూరి బాక్సాఫీస్ క్లాష్ కొత్తేమీ కాదు. దశాబ్దాల నుంచి చూస్తున్నదే. ఈ సంక్రాంతికి కూడా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మూవీ గేమ్ చేంజర్, నందమూరి బాలకృష్ణ సినిమా డాకు మహారాజ్ పోటీ పడ్డాయి. అంతకుముందు చిరు సినిమా వాల్తేరు వీరయ్య, బాలయ్య చిత్రం వీరసింహారెడ్డి ఢీకొట్టాయి. గతంలో ఇంకా మరెన్నో సందర్భాల్లో మెగా, నందమూరి బాక్సాఫీస్ పోరును చూశాం. కానీ ఈ ఏడాది దసరాకు మరోసారి పోరు తప్పేలా లేదు. కానీ ఇప్పటిదాకా జరిగిన క్లాష్‌లు వేరు. ఈ పోరు వేరు. ఇప్పటికే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా ఓజీకి సెప్టెంబరు 25ను రిలీజ్ డేట్‌గా ఎంచుకున్నారు. పవన్ సినిమా వస్తోందంటే.. అంతకుముందే ఆ డేట్‌కు ఫిక్సయిన బాలయ్య చిత్రం అఖండ-2 రాదనే అనుకున్నారంతా. కానీ లేటెస్ట్‌గా రిలీజ్ చేసిన టీజర్లో సేమ్ డేట్ వేశారు. పక్కాగా సినిమా ఆ రోజే రాబోతోందని తేల్చేశారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో బాలయ్య, పవన్ మధ్య పోరును చూడాలని వారి అభిమానులు కోరుకోవట్లేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేనలతో కూడిన కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. గతంలో పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ బాలయ్య, పవన్ మధ్య ప్రస్తుతం మంచి సంబంధాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఇద్దరు హీరోలు బాక్సాఫీస్ దగ్గర తలపడితే బాగుండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సినిమాల కారణంగా ఇరువురి అభిమానుల మధ్య కలహాలు




మొదలై.. సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్స్ తీవ్రమవుతాయేమ అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ రోజుల్లో అభిమానులు.. అవతలి హీరోల మీద సోషల్ మీడియాలో విషం చిమ్మడం పెరిగిపోతోంది. సంక్రాంతి టైంలోనూ అదే జరిగింది. తమ హీరో సినిమా బాగా ఆడాలని అనుకోవడం కంటే.. అవతలి హీరో సినిమా నాశనమైపోవాలని కోరుకునేవాళ్లే ఎక్కువైపోయారు. ఇందుకోసం పనిగట్టుకుని విష ప్రచారాలు చేసుకుంటున్నారు. తద్వారా అభిమానుల మధ్య వైరం పెరిగిపోతోంది. ఒకేసారి ఇద్దరు స్టార్ హీరోల సినిమాలు రిలీజైనపుడు ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో దసరాకు ఇద్దరు హీరోల్లో ఒకరు తగ్గి వేరే డేట్ చూసుకుంటే మంచిదేమో అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# కత్రినా కైఫ్‌కు క్రేజీ ఛాన్స్..
# ఆ దేశానికి బ్రాండ్ అంబాసిడర్‌గా!





భారత చిత్ర పరిశ్రమలో ప్రముఖ వ్యక్తి అయిన కత్రినా కైఫ్‌ను మాల్దీవులకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం పట్ల తాము సంతోషంగా ఉన్నామని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించేందుకు బాలీవుడ్ హీరోయిన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ అవకాశం రావడంపై బాలీవుడ్ భామ కత్రినా కైఫ్ స్పందించింది. గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై సంతోషం వ్యక్తం చేసింది. మాల్దీవులు అందించే లగ్జరీ, అందాలను సూచించడానికి ఉత్సాహంగా ఉన్నట్లు పేర్కొంది. గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా తన కొత్త రోల్ గురించి కత్రినా మాట్లాడుతూ.. 'మాల్దీవులు లగ్జరీ, సహజ సౌందర్యానికి కేరాఫ్ అడ్రస్. చక్కని ప్రశాంతంగా ఉండే ప్రదేశం. సన్నీ సైడ్ ఆఫ్ లైఫ్‌గా ఎంపికైనందుకు నేను గౌరవంగా భావిస్తున్నా. ఈ సహకారం ప్రపంచ పర్యాటక ప్రేక్షకులకు అత్యుత్తమ ప్రయాణ అనుభవాలను తీసుకురావడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు ఈ అద్భుతమైన గమ్యస్థానం, ప్రత్యేకమైన ఆకర్షణ, ప్రపంచ స్థాయిలో పేరు పొందేలా సహాయపడటానికి ఉత్సాహంగా ఉన్నానని" తెలిపింది. అయితే ప్రధాని మోదీ పర్యటనకు ముందు ఈ ప్రకటన రావడం విశేషం. వచ్చే నెలలో మాల్దీవుస్‌లో ప్రధాని పర్యటించనున్నారు.

బాలీవుడ్ భామ కత్రినా కైఫ్‌కు అరుదైన ఛాన్స్ దక్కింది. ఆమె పర్యాటక అభివృద్ధికి అంబాసిడర్‌గా ఎంపికైంది. అయితే కత్రినాను ఎంపిక చేసింది మాత్రం మన దేశానికి కాదు. గతేడాది మనదేశంతో దౌత్యపరమైన వివాదానికి తెరలేపిన దేశానికి ఆమె గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. ఆ దేశం మరెదో కాదు.. మన దగ్గర్లోనే ఉన్న మాల్దీవుస్. కత్రినా కైఫ్‌ను మాల్దీవులకు ప్రపంచ పర్యాటక రాయబారిగా నియమించినట్లు మాల్దీవుల మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ వెల్లడించింది.

# అనధికార టెస్టులు..
# అదరగొట్టిన భారత ఆటగాళ్లు వీరే!




ఇంటర్నెట్ డెస్క్: ఇంగ్లండ్, భారత జట్ల మధ్య జూన్ 20 నుంచి అయిదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. దీనికి సన్నాహకంగా ఇండియా ఎ, ఇంగ్లండ్ లయన్స్ జట్లు రెండు అనధికార టెస్టు మ్యాచ్‌లు ఆడాయి. ఆ రెండూ డ్రాగానే ముగిశాయి. వీటిల్లో పలువురు భారత ఆటగాళ్లు సాధికారికంగా ఆడి, సత్తా చాటితే, ఇంకొందరు మెప్పించలేకపోయారు. బ్యాటింగ్‌లో కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ రాణిస్తే.. యశస్వి జైస్వాల్ విఫలమయ్యాడు. బౌలింగ్‌లో అంశుల్ కాంబోజ్ ప్రభావం చూపితే, శార్దూల్ ఠాకూర్, నితీశ్ కుమార్ రెడ్డి తేలిపోయారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

కాంబోజ్ భారత్ తరఫున కీలక బౌలర్‌గా నిలిచాడు. బౌలింగ్‌లో అయిదు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. బ్యాట్‌తోనూ రాణించాడు. ఒక హాఫ్ సెంచరీ చేశాడు. ఖలీల్ అహ్మద్ ఒకే మ్యాచ్ ఆడాడు. అయినా బంతితో ఆకట్టుకున్నాడు. అతడు నాలుగు వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో కరుణ్ నాయర్ తన సత్తా చాటాడు. మొదటి అనధికార టెస్ట్ మ్యాచ్‌లో ఏకంగా డబుల్ సెంచరీ సాధించాడు. మొత్తంగా 259 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ కూడా బ్యాట్‌తో మెరిశాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో 167 పరుగులు చేశాడు. ధ్రువ్‌జురెల్ మూడు అర్ధసెంచరీలు నమోదు చేశాడు. మొత్తంగా 227 రన్స్ సాధించాడు. సర్ఫరాజ్ ఖాన్‌కు ఒక్కసారి మాత్రమే బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చింది. దాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుని 92 పరుగులు చేశాడు.

వీరు విఫలమయ్యారు!

ఎన్నో అంచనాల మధ్య ఇంగ్లండ్‌కు వెళ్లిన శార్దూల్ ఠాకూర్ అటు బ్యాట్‌తోనూ, ఇటు బాల్‌తోనూ విఫలమయ్యాడు. కేవలం రెండు వికెట్లు మాత్రమే తీసుకుని నిరాశ పరిచాడు. బ్యాటింగ్‌లో కేవలం 80 పరుగులే చేశాడు. యశస్వి జైస్వాల్ అనుకున్న స్థాయిలో రాణించలేదు. రెండు మ్యాచుల్లో కలిపి 110 రన్స్ మాత్రమే సాధించాడు. ఇండియా ఎ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన అభిమన్యు ఈశ్వరన్ కూడా బ్యాటింగ్‌లో పెద్దగా రాణించలేదనే చెప్పాలి. నాలుగు ఇన్నింగ్స్‌లలో కేవలం 164 పరుగులే చేశాడు. ఇందులో రెండు అర్ధ సెంచరీలున్నాయి. నితీశ్ రెడ్డి రెండు మ్యాచుల్లో 135 పరుగులు మాత్రమే చేయగలిగాడు. బౌలింగ్‌లో కేవలం రెండు వికెట్లు మాత్రమే తీసుకున్నాడు.

# అమ్మకానికి ఆర్సీబీ..?



గత కొన్ని రోజులుగా ఆర్సీబీ అభిమానులు మిశ్రమ అనుభవాలను ఎదుర్కొంటున్నారు. జూన్ 3న ఆ జట్టు 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ గెలుపును ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్సీబీ అభిమానులు అవధుల్లేకుండా ఎంజాయ్ చేశారు. అయితే ఆ మరుసటి రోజే ఓ ఊహించని ఘటన ఆర్సీబీ అభిమానులను కృంగదీసింది. విజయోత్సవాల్లో భాగంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన నుండి తేరుకోకఉండే ఆర్సీబీ అభిమానులకు మరో షాకింగ్ వార్త తెలిసింది. ఈ ఫ్రాంచైజీని అమ్మకానికి పెట్టినట్లు ఓ ప్రముఖ దినపత్రిక తమ కథనంలో పేర్కొంది. సదరు కథనం ప్రకారం, ఆర్సీబీ చేతులు మారే అవకాశం ఉంది. ప్రస్తుత యాజమాన్యం (డియాజియో అనుబంధ సంస్థ అయిన యునైటెడ్ స్పిరిట్స్) ఆర్సీబీని సుమారు 2 బిలియన్ డాలర్లకు విక్రయించడానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది.

### ఎందుకు విక్రయించాలని అనుకుంటుందంటే..?

ఆర్సీబీకి భారత్‌లోనే కాక ?ప్రపంచవ్యాప్తంగా విశేషమైన ప్రజాదరణ ఉంది. ఈ ఫ్రాంచైజీ ఒక్కసారే టైటిల్ గెలిచినా (అది కూడా ఈ ఏడాదే) ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన బ్రాండ్‌లలో ఒకటిగా చలామణి అవుతుంది. దీన్నే ప్రస్తుత యాజమాన్యం క్యాష్ చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఫ్రాంచైజీ యొక్క పెరుగుతున్న విలువను ఉపయోగించుకుని ఎక్కువ భాగం కాకపోయినా, కొన్ని వాటాలైనా విక్రయించాలని యునైటెడ్ స్పిరిట్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. తద్వారా యునైటెడ్ స్పిరిట్స్ భారీగా లబ్ది పొందే అవశామున్నట్లు సమాచారం. యునైటెడ్ స్పిరిట్స్ ఆర్సీబీని విక్రయించడానికి మరో కారణం కూడా ఉండొచ్చని తెలుస్తుంది. గత కొన్ని సీజన్ల నుండి బీసీసీఐ పొగాకు ఉత్పత్తులు, ఆల్కహాల్ కంటెంట్ ప్రకటనలపై అనేక ఆంక్షలు విధించింది. దీని వల్ల



యునైటెడ్ స్పిరిట్స్ ఉత్పత్తుల యొక్క ప్రచారం కష్టతరం అవుతుంది. ఇది తమ కంపెనీ వృద్ధికి ఆటంకం కలిగిస్తుందని యునైటెడ్ స్పిరిట్స్ భావిస్తున్నట్లు తెలుస్తుంది.

### ఆందోళనలో ఫ్యాన్స్

ఇదిలా ఉంటే, యాజమాన్యం చేతులు మారే ప్రచారం మొదలైనప్పటి నుంచి ఆర్సీబీ అభిమానులు తెగ ఆందోళన చెందుతున్నారు. వారు ఎంతగానో ఇష్టపడే ఆర్సీబీ పేరు మారుతుందేమోనని దిగాలు పడుతున్నారు.

### విజయ్ మాల్యా నుంచి చేజిక్కించుకున్న డియాజియో

ఆర్సీబీకి భారత వ్యాపారవేత్త విజయ్ మాల్యా పురుడు పోశాడు. వేర్వేరు కారణాల వల్ల మాల్యా తన స్పిరిట్స్ వ్యాపారాన్ని డియాజియోకు విక్రయించడంతో వారి భారత విభాగం 'యునైటెడ్ స్పిరిట్స్' ఆర్సీబీ యాజమాన్యాన్ని చేజిక్కించుకుంది. డియాజియో గురించి చెప్పాలంటే.. ఇది 1997లో స్థాపించబడిన బ్రిటిష్ కంపెనీ. ఈ బ్రాండ్ ఆల్కహాలిక్ మరియు నాన్ ఆల్కహాలిక్ పానీయాలను ఉత్పత్తి చేస్తుంది. ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్పిరిట్స్ కంపెనీ.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh,epaper. www.prabhatha suryaa.com. Email. Prabhata surya @gmail.com.Rni TGTEL/25/A0784.